ఈనాడు ఆదివారం

2 నవంబరు 2025



150 జాగృతి గీతం... వందే మాతరం!

ప్రతిదీ తనతో పంచుకుంటా..!



ధ్రువ్.. అంటే అంతగా తెలియకపోవచ్చు. కానీ, ధ్రువ్ విక్రమ్ అంటే మాత్రం విలక్షణ నటుడు విక్రమ్ కొడుకు అని టక్కున గుర్తుపట్టేస్తారు. స్టార్ కిడ్ అయినా తనకంటూ సొంతంగా గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నాల్లో ఉన్నాడీ కుర్ర హీరో. తండ్రి నుంచి అచ్చు అవే రూపురేఖలతోపాటు కష్టపడే తత్వాన్నీ ఒంటపట్టించుకున్నానంటున్నాడు. ఇటీవల తెలుగులో విడుదలైన తన తొలి సినిమా 'బైసన్'తో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. అతడి ముచ్చట్లే ఇవి..

షార్ట్ ఫిల్మ్ తీశా

నేను పుట్టి పెరిగిందంతా చెన్నైలోనే. స్కూల్లో ఉన్నప్పటి నుంచే డబ్‌స్మాష్‌లూ, యూట్యూబ్ వీడియోలూ చేసేవాడిని. చిన్నప్పటి నుంచీ నాన్నను చూస్తూ.. ఫ్యాన్ బాయ్‌లా పెరిగా. నేనూ అలా పెద్ద స్టార్ కావాలని కలలు కనేవాడిని. సినిమాల్లోకి రాకముందే చిన్నారులపైన వేధింపులకు సంబంధించిన ఓ షార్ట్‌ఫిల్మ్ తీశా.

అక్కడే నా ఆలోచన మారింది

నేను హీరోనవుతానని స్నేహితులతో చెబితే.. వాళ్లు మా నాన్నలా డాన్స్ చేయమనీ, ఏదైనా డైలాగ్ చెప్పమనీ అడుగుతుండేవారు. అయితే, చిన్నప్పటి నుంచీ నేను ఏదైనా చెబితే అది జరగదేమోననే ఫోబియా నన్ను వెంటాడేది. దాంతో హీరోనవుతానని చెప్పడం మాని, ఫొటోగ్రాఫర్ అవుతాననేవాడిని. న్యూయార్క్‌లో కోర్సు అయిపోగానే.. డైరెక్షన్‌లో మెలకువలు నేర్చుకునేందుకు లండన్‌లోని ఓ శిక్షణ సంస్థలో చేరా. అక్కడి వారిని చూశాక.. నా ఆలోచనా దృక్పథం మారింది. జీవితంలో మనం ఏది కావాలనుకుంటామో, దాన్నే బలంగా కోరుకోవాలని అర్థమైంది.

చదువు తర్వాతే ఏదైనా..

మా ఇంట్లోనూ సినిమా వాతావరణమే ఉండేది. అందుకే కాబోలు నాకు స్కూల్‌కి వెళ్లేటప్పుడే ఓ చిత్రంలో అవకాశం వచ్చింది. కానీ, అమ్మానాన్నలేమో 'యాక్టింగ్‌కు ఇంకా టైమ్ ఉంది. ముందు నీ చదువుపైన దృష్టిపెట్టు' అన్నారు. నేనూ సరేనన్నా. కాలేజీ చదువు అయిపోగానే న్యూయార్క్‌లోని ఓ ఫిల్మ్ స్కూల్‌లో చేరా.

అలా ఎంట్రీ ఇచ్చా...

ఒకసారి డైరెక్టర్ బాల అంకుల్ ఇంటికి వచ్చి.. తెలుగు సినిమా 'అర్జున్ రెడ్డి'ని నాతో రీమేక్ చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. నాన్నా సరేననడంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టా. ఆ సినిమాను దాదాపు 50 నుంచి 60 సార్లు చూసి, ఆ పాత్ర తీరుతెన్నులన్నీ బాగా గమనించా. ఆ సినిమాకు నేను తీసుకున్న పారితోషికాన్ని వరద బాధితుల కోసం కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కి అందించా.

కబడ్డీలో శిక్షణ తీసుకున్నా

'బైసన్' సినిమా కోసం రెండేళ్లు ప్రొఫెషనల్ కబడ్డీలో శిక్షణ తీసుకున్నా. ఆ షూటింగ్ సమయంలో ఎడమ చేయి బెణికింది.. ఒకట్రెండు పళ్లూ విరిగాయి. సినిమా విడుదలయ్యాక వస్తున్న స్పందన చూస్తుంటే.. ఆ శ్రమ మొత్తం దూదిపింజలా ఎగిరిపోయింది.



సింగర్‌ని కూడా...

యాక్టింగ్ తర్వాత నాకిష్టమైంది మ్యూజిక్. సినిమాలతోపాటు ప్రైవేట్ ఆల్బమ్స్‌కూ పాడుతుంటా. తెలుగులో 'హాయ్ నాన్న' చిత్రంలో 'ఓడియమ్మ..' పాట పాడా. నేను పాటల రచయితను కూడానని అతికొద్దిమందికి మాత్రమే తెలుసు.

హాబీలు: ప్రతిరోజూ జిమ్ చేయడం, పప్పీతో ఆడుకోవడం, గిటార్ వాయించడం.

మెచ్చే నటులు: విజయ్, షారుఖ్ ఖాన్, రణ్‌బీర్ కపూర్.

బెస్ట్ ఫ్రెండ్: అక్క అక్షిత మాటపైన నాకు నమ్మకం ఎక్కువ. అందుకే ఏదైనా ముందు తనతోనే పంచుకుంటా.

అదే నా ఆశ

సూట్‌కేసు కొందామని హైదరాబాద్‌లోని ఓ మాల్‌కెళ్తే, కొందరు నన్ను గుర్తుపట్టి అరిచారు. అది చూసి ఆ షాప్ ఓనర్ 'వాళ్లు మీ ఫ్రెండ్సా?' అని అడిగితే.. కాదన్నాను. ఆ తర్వాత మీరు అచ్చం హీరో విక్రమ్‌లా ఉన్నారని ఆయన అనడంతో.. నేను ఆయన కొడుకునని చెప్పా. దాంతో సినిమాల్లో నాన్న పాత్రల్నీ, అందుకోసం పడే కష్టాన్నీ ప్రస్తావించి నాన్నంటే చాలా అభిమానమని చెప్పారాయన. భవిష్యత్తులో నా కొడుకూ ఇలా బయటకు వెళ్తే.. 'మీ నాన్న ధ్రువ్ అంటే చాలా ఇష్టం' అని జనాలు చెప్పుకోవాలని ఆశపడుతున్నా.

లోపల

మంచిమాట

పోటీలేని గెలుపు, కష్టపడకుండా వచ్చే డబ్బు, నమ్మకం లేని బంధం ఎక్కువకాలం నిలబడవు.

మీకు తెలుసా!

జపాన్‌లో 95 శాతం ఫోన్‌లు వాటర్‌ప్రూఫ్‌గానే ఉంటాయి. ఇంత ఎక్కువగా వాటర్‌ప్రూఫ్ ఫోన్‌లు వాడే దేశం అదొక్కటే. ఐఫోన్, శామ్‌సంగ్... ఇలా ఏ కంపెనీ అయినా జపాన్ మార్కెట్ కోసం ప్రత్యేకంగా తమ మోడళ్లన్నింటినీ ఇలాగే తీర్చిదిద్దుతాయి. జపనీయుల్లో స్నానం చేసేటప్పుడూ... ఈత కొట్టేటప్పుడూ ఫోన్ మాట్లాడే అలవాటుంది కాబట్టి వాళ్లకి ఇలా వాటర్‌ప్రూఫ్ తప్పనిసరట!

మన సామెత

అయినవాడు కాలు దువ్వితే కానివాడు మీదికొస్తాడు.

సిల్లీ పాయింట్



ప్రాచీన చైనీయులు భారత్‌ని త్యాంజు అని పిలిచేవాళ్లు. దానర్థం... స్వర్గం అని!

★ ఉదయం నిద్రలేవగానే మీకు బెడ్ సర్దుకునే అలవాటు ఉందా... ఉంటే మీరు మీ జీవితంలో విజయవంతమైనట్లేనట. ధనవంతులూ అవుతారట. ఈ చిన్న అలవాటుతో అలవడే క్రమశిక్షణ- ఆ రోజంతా మీరు చేయబోయే పనిలో ఉత్సాదకత పైనా సానుకూల ప్రభావం చూపుతుందని ఓ అధ్యయనం చెబుతోంది.

★ ఆఫ్రికా దేశమైన మొజాంబిక్ జాతీయ పతాకంలో ఏకే47 తుపాకీ కూడా ఉంటుంది.

★ అంతరిక్షంలో మనిషి తిన్న తొలి ఆహారం... ఆపిల్ సాస్!

★ సముద్రాల్లోని బంగారాన్నంతటినీ వెలికితీసి, భూమి మీదున్న అందరికీ పంచితే... ప్రతి ఒక్కరికీ తక్కువలో తక్కువ 4 కేజీలు వస్తుందట.

★ నెయిల్ పాలిష్ నిజానికి మగవారి కోసం పుట్టిందే. 3500 ఏళ్ళ కిందట బాబిలోనియాకి చెందిన మగవారు యుద్ధానికి ముందు గోళ్లకి ఇలా రంగులు వేసుకుని వెళ్ళడం ఆనవాయితీగా ఉండేదట.

★ ఇప్పటివరకూ రికార్డైన ఉష్ణోగ్రతల్లో అతి తక్కువ- మైనస్ 144 డిగ్రీల ఫారన్‌హీట్. అంటార్కిటికాలో నమోదైన ఈ ఉష్ణోగ్రతలో మూడు నాలుగుసార్లు శ్వాస పీల్చినా ప్రాణం పోయినట్లే.

★ అంతరిక్షంలోకి వెళితే... మనం ఏం తిన్నా తేన్పులు రావు!

★ ఇతర ప్రపంచ దేశాల మాదిరిగా కాకుండా చైనాలో సూప్‌ని భోజనం మొత్తం పూర్తయ్యాక తాగుతారు. ఇది జీర్ణశక్తిని పెంచుతుందనేది వారి భావన.




1939లో వాల్ట్ డిస్నీ ప్రొడక్షన్స్ నిర్మించిన 'స్నో వైట్ అండ్ సెవెన్ డ్వార్ఫ్స్' చిత్రానికి ఆస్కార్ అవార్డు లభించింది. అయితే, మామూలుగా ఇచ్చే అవార్డు జ్ఞాపికకు బదులుగా... ఓ పెద్ద ప్రతిమ, దాని పక్కన ఏడు చిన్న ప్రతిమల్ని ప్రత్యేకంగా డిజైన్ చేసి అందించారు. ఆస్కార్ ప్రతిమని ఓ చిత్రం కోసం అలా మార్చడం చాలా అరుదు!

★ 'స్కౌట్స్ అండ్ గైడ్స్' శిక్షణలో ఉండేవాళ్లు ఎడమచేతితోనే కరచాలనం చేస్తారు! స్నేహంకోసం గుండెకి దగ్గరగా ఉన్న చేతినే సాచాలన్న భావన ఇందుకు కారణమట.

★ అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ... క్యూబాపై వాణిజ్య ఆంక్షలను అమలు చేయడానికి ముందు 1200 క్యూబన్ సిగార్లను కొని దాచుకున్నాడట.



ప్రపంచంలోనే అత్యంత చిన్నకోతి పిగ్మీమార్మోసెట్ జాతికి చెందినది. మన వేలంత ఉంటుంది.



లియొనార్డో దవించి, మైకెలేంజిలో, విన్సెంట్ వాన్ గా... ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారులు వీళ్ళు! గమ్మత్తేమిటంటే, ఈ ముగ్గురూ ఎడం చేతి వాటం ఉన్నవాళ్ళే!



నీళ్లలోంచి బయటపడేందుకు ఓ నల్ల పిల్లి చేసే ప్రయత్నమే 'ఫ్లో'. ఈ యానిమేషన్ చిత్రానికి ఆస్కార్ రావడమే కాదు.. విడుదల తర్వాత నల్ల పిల్లులకు చాలా డిమాండ్ ఏర్పడిందట.

★ పనున్నా లేకున్నా మనం రోజుకి 110 సార్లు ఫోన్‌ని చెక్ చేస్తామని ఓ అంచనా!

అమెరికాలో ఓ బాబు ఏడో నెల పద కొండో తేదీన 7:11 నిమిషాలకు పుట్టడంతో.. అక్కడి '7-ఎలెవన్' సంస్థ అతడికి 7,111 డాలర్లను బహుమతిగా అందించింది.



★ ధృవపు ఎలుగుబంట్లు అన్నీ ఎడమచేతి వాటం కలిగి ఉంటాయి.

★ అమెరికన్లు చాక్లెట్ ప్రియులు. ప్రపంచంలో ఉత్పత్తయ్యే చాక్లెట్లలో 18 శాతం వాళ్ళే తింటారని చెబుతోంది ఓ సర్వే.

★ 'ఈరోజు మీ మూడ్ బాలేదా? అయితే సెలవు తీసుకోండి' అంటూ ఉద్యోగులకు ఆఫర్ ఇస్తోందో చైనా కంపెనీ. ఈ 'అన్‌హ్యాపీ లీవ్స్' గరిష్ఠంగా ఏడాదికి పది రోజులపాటు ఇవ్వనుంది.

★ ప్రపంచంలో సెల్‌ఫోన్ వినియోగించే వారి సంఖ్య 520 కోట్లయితే... టూత్‌బ్రష్ వాడేవారి సంఖ్య మాత్రం 420 కోట్లేనట!



పెళ్లికి వెళ్లడానికి చక్కటి పట్టు లెహెంగా కావాలంటే అద్దెకి తెచ్చుకోవచ్చు. నయా లగ్జరీ కారునీ రెంట్‌కు తీసుకునే అవకాశమూ ఉంది. అంతేనా... మరి ఇప్పుడైతే బంగారు హారాల్నీ, డైమండ్ నెక్లెసుల్నీ కూడా అద్దెకు తెచ్చుకోవచ్చు. ఎక్కడో, ఏంటో ఆ వివరాల్లోకి వెళితే...





బంగారు నగలూ అద్దెకిస్తున్నారు!





అమ్మాయినీ బంగారాన్నీ అస్సలు విడదీసి చూడలేం. పసిడి మెరుపులు అమ్మాయికి అందాన్ని తెచ్చిపెడతాయి. అతివ మెడలోకి చేరినప్పుడే బంగారం సొగసు మరింత పెరుగుతుంది. అందుకే పెళ్లీ, పేరంటాల్లో పట్టుచీరలు కట్టి మగువలందరూ ఎంత అందంగా ముస్తాబైనా- చిన్నదో, పెద్దదో ఓ బంగారు నగ ఉండి తీరాల్సిందే అంటారు. ఎప్పటికప్పుడు నయా నగల మీద మనసు పారేసుకుంటారు. అమ్మమ్మల కాలం నుంచీ ఈ ట్రెండ్ బాగానే నడిచినా ఇప్పుడు మాత్రం దానికి చిన్న బ్రేక్ పడినట్టే. పెరిగిపోతున్న బంగారం ధరలు అమ్మాయిల మనసును కాస్త చిన్నబుచ్చుతున్నాయనే చెప్పాలి. మరి ఈ సమస్యకు పరిష్కారమే లేదా అంటే- 'కచ్చితంగా ఉంది' అంటూ బంగారు నగల్ని అద్దెకిచ్చే నయా ట్రెండ్‌ని ఫాలో అవుతున్నాయి కొన్ని జ్యువెలరీ దుకాణాలు.

ఏమేం ఉన్నాయ్?


ప్రతి వేడుకకీ సరికొత్తగా తయారవ్వాలనుకునే ఈతరాన్ని దృష్టిలో పెట్టుకుని మార్కెట్లో కొన్ని సంస్థలు పార్టీవేర్ డ్రెస్సుల్నీ, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీని రెంట్‌కి ఇవ్వడం మొదలుపెట్టాయి. వీటి సాయంతో తక్కువ ఖర్చుతోనే అనుకున్నట్టు తయారయ్యే వీలు ఉండటంతో ఈ ట్రెండ్ చాలావరకూ ఆకట్టుకుంటోంది. ఇప్పుడు ఇదే పద్ధతిని బంగారు దుకాణాలూ తీసుకొస్తున్నాయి. కర్ణాటకకు చెందిన శ్రీస్టార్ గోల్డ్ కంపెనీలో బంగారు నగల్ని కొనుక్కోవడం, అమ్ముకోవడమే కాదు... కావాలంటే రెంట్‌కి కూడా తీసుకోవచ్చు. 'వి గివ్ గోల్డ్ ఆన్ రెంట్' పేరుతో ప్రత్యేకమైన సర్వీస్‌ను అందిస్తున్నారు ఇందులో. చెన్నై, హైదరాబాద్ నగరాల్లోనూ ఈ సంస్థ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఒక రోజు నుంచి వారం రోజుల వరకూ నగల్ని అద్దెకి తీసుకోవచ్చు. అయితే దానికి కొన్ని కచ్చితమైన నిబంధనలు ఉన్నాయి. తీసుకోవాలనుకున్నవాళ్లకు సొంత ఇల్లు ఉండాలి. ఐడీ ప్రూఫ్, చెక్ లాంటివన్నీ ఇవ్వాలి. గడువు తర్వాత నగను భద్రంగా తెచ్చి అప్పగించాల్సి ఉంటుంది. నగ విలువను బట్టీ, తీసుకునే రోజుల్ని బట్టీ ఇంత అని అద్దె వసూలు చేస్తారు.

ముంబయికి చెందిన ఈవ్స్24 వాళ్లు కూడా విలువైన ఆభరణాల్ని అద్దెకిస్తున్నారు. వజ్రాలూ, కెంపులూ, పచ్చలతో తీర్చిదిద్దిన నగలెన్నో ఉంటాయి వీళ్ల దగ్గర. ప్రత్యేకంగా మెంబర్‌షిప్ కార్డులు కూడా ఇస్తారు. మూడు రోజులకు నగ మొత్తం విలువలో మూడు నుంచి నాలుగు శాతం వరకూ అద్దె వసూలు చేస్తారట. లక్షల విలువైన నగలు ఎవరికంటే వాళ్లకు అలా ఇచ్చేయరు కదా. అందుకే నగ ధరను బట్టి కొంత డబ్బు కూడా డిపాజిట్ చేయించుకుని, వివరాలన్నీ చెక్ చేశాకే రెంట్‌కి ఇస్తుంటారు.



పెరిగిపోతున్న బంగారం ధరల దృష్ట్యా- కొత్తగా వస్తున్న ఈ జ్యువెలరీ రెంట్ ట్రెండ్ అందరికీ ఎంతగానో ఉపయోగపడుతుందనే చెప్పాలి. 'అబ్బ, అన్ని వేడుకలకీ అవే నగలు వేసుకోవాలా' అని ఆలోచించే మహిళలకీ, 'బంగారు ఆభరణాలు ఇంకేం కొంటాంలే' అనుకునే ఆడవాళ్లకీ ఈ విధానం ఎంతో నచ్చుతుంది. ఒకటో రెండో కాకుండా అన్ని జ్యువెలరీ దుకాణాలూ ఇలాంటి సదుపాయాన్ని తీసుకొస్తే ఎంతో బాగుంటుంది కదా! ★





చర్మకణాలతోనూ పిల్లలు...

చదువూ, కెరియర్ అంటూ చాలామంది మహిళలు సంతానాన్ని వాయిదా వేస్తూ వస్తున్నారు. ఆ తర్వాత పిల్లల్ని కనాలనుకున్నా వాళ్లలో అండాల కొరత ఉంటోంది. మరికొందరిలో క్యాన్సర్ వంటి వ్యాధుల కారణంగానూ, ఇతరత్రా వైద్య సమస్యలతోనూ అండాలు లేని పరిస్థితి. మరి ఇలాంటి వాళ్లు పిల్లలని కనాలన్న ఆశకి దూరం కావాల్సిందేనా అంటే- ఇకపైన ఆ అగత్యం లేదంటున్నారు నిపుణులు. అండాలు లేకపోతేనేం, చర్మకణాలతో కూడా సంతానాన్ని పొందవచ్చని నిరూపించారు అమెరికాలోని ఒరిగాన్ సైన్స్ అండ్ హెల్త్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. 'సొమాటిక్ సెల్ న్యూక్లియర్ ట్రాన్స్‌ఫర్' విధానంలో చర్మకణాల నుంచి న్యూక్లియస్‌ని వేరు చేశారు. ఈ న్యూక్లియస్‌లో ఒక వ్యక్తికి సంబంధించిన పూర్తి జన్యు సమాచారం ఉంటుంది. దీనిని వేరే దాత నుంచి సేకరించిన ఖాళీ అండంలో ప్రవేశపెట్టారు. ఇలా తయారైన సంపూర్ణమైన అండాన్ని వీర్యకణంతో కలిపి పిండాన్ని సృష్టించారు. సంతాన సాఫల్య విధానాల్లో ఇదో విప్లవాత్మక మార్పు అనీ, తమ సొంత అండాలతోనే పిల్లలని కనాలనుకునే వారికి ఇదో వరంగా మారనుందనీ శాస్త్రవేత్తలు అంటున్నారు.

పెరుగుతో క్యాన్సర్‌కి దూరం...

నోరూరించే వంటకాలు ఎన్నున్నా, చివరిగా ఒక్క ముద్ద అయినా పెరుగన్నంతో తినకపోతే మనలో చాలామందికి ఏదో వెలితిగా ఉంటుంది. నిజానికి ఈ అలవాటు పెద్దపేగు క్యాన్సర్లని 20 శాతానికిపైగా తగ్గిస్తుందని అమెరికాకు చెందిన మాస్‌జనరల్ బ్రిగ్‌హామ్ అనే ఆరోగ్య పరిశోధనా సంస్థ తేల్చింది. సుమారుగా లక్షన్నరమందిపైన పదేళ్లపాటు చేసిన పరిశోధనలో తేలిన విషయాలివి. వారంలో కనీసం రెండుసార్లైనా పెరుగు తినే వారిలో పెద్దపేగుకు సంబంధించిన క్యాన్సర్లు 20 నుంచి 30శాతం తక్కువగా ఉండటాన్ని శాస్త్రవేత్తలు గమనించారు. ఇందుకు పెరుగులోని లాక్టోబాసిల్లస్, బిఫిడో బ్యాక్టీరియాలే కారణమట. ముఖ్యంగా బిఫిడో బ్యాక్టీరియమ్ మన పేగుల్లో ఉండే ఆరోగ్యకరమైన గట్ బ్యాక్టీరియాకి బలాన్ని చేకూర్చి వ్యాధినిరోధకశక్తి తగ్గకుండా చూస్తుందట. క్యాన్సర్ కణాల ఎదుగుదలని అడ్డుకునే శక్తి కూడా పెరుగులోని బ్యాక్టీరియాకి ఉందని ఈ పరిశోధనలో తేలింది. అందుకే కనీసం వారంలో రెండుసార్లు అయినా ఆహారంలో పెరుగుని చేర్చుకుంటే క్యాన్సర్ల బారినపడకుండా ఉండొచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు.



పరిశోధన



చిప్‌తో కంటిచూపు!

వయసుతోపాటు వచ్చే కంటి సమస్యల్లో డ్రై-ఏఎమ్‌డీ(ఏజ్ రిలేటెడ్ మాక్యులర్ డీజనరేషన్)కూడా ఒకటి. ఈ సమస్య ఉన్నవాళ్లు ఒక దృశ్యాన్ని చూసినప్పుడు చుట్టూ ఉన్నవన్నీ కనిపిస్తాయి కానీ మధ్యలో ఉన్న భాగం కనిపించదు. ముఖ్యంగా వీళ్లు అక్షరాలని చదవలేరు. వయసు కారణంగా రెటీనా మధ్యభాగంలో కొన్నిరకాల వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల వచ్చే సమస్య ఇది. ఇంతవరకూ కళ్లద్దాలూ, మందులూ, శస్త్రచికిత్సలతో పరిష్కారం దొరకని ఈ సమస్యకు తాజాగా ఏఐ టెక్నాలజీతో ఉపశమనం దొరకడం విశేషం. అమెరికాలోని యూసీఎల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆఫ్తాల్మాలజీ సంస్థ తలవెంట్రుక పరిమాణంలో ఉండే ఒక చిప్‌ని తయారుచేసింది. ఈ చిప్‌ని రెటీనా అడుగు భాగంలో అమర్చిన తర్వాత ఏఐతో పనిచేసే కళ్లద్దాలు కూడా ధరించాల్సి ఉంటుంది. ఈ కళ్లద్దాలు పంపించే సిగ్నల్స్‌ని కంటిలోని చిప్ గ్రహించడం వల్ల ఆ వ్యక్తులు మునుపటిలా చూడగలుగుతారు, చదవగలుగుతారు. పదిహేడు దేశాల్లో వివిధ ఆసుపత్రుల్లో రోగులకి ఈ చిప్‌ని అమర్చి శాస్త్రవేత్తలు విజయం సాధించారు.

ముందే రజస్వల ఎందుకంటే...

ఈ మధ్య కాలంలో ఆడపిల్లలు త్వరగా రజస్వల అవడాన్ని చూస్తూనే ఉన్నాం. ఇలా జరగడానికి కారణం ఏంటీ అనే దిశగా ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనలు జరుగుతుండగా... ఇందుకు యాంటీబయోటిక్స్ ఒక కారణం అంటోంది దక్షిణ కొరియాలో జరిగిన అధ్యయనం. అవును, దక్షిణ కొరియాకి చెందిన యూనివర్సిటీ ఆసుపత్రులు సమారు రెండులక్షలమంది ఆడపిల్లలపైన ఒక అధ్యయనం చేశాయి. శాస్త్రవేత్తలు ఆ పిల్లలని పుట్టినప్పట్నుంచీ తొమ్మిదేళ్లు వచ్చేంతవరకూ గమనించారు. ఏదైనా అనారోగ్య కారణంతో ఏడాదిలోపు- ముఖ్యంగా తొలి మూడునెలల్లో- యాంటీబయోటిక్స్ తీసుకున్న ఆడపిల్లల్లో 22 శాతం మంది ఎనిమిదేళ్లకంటే ముందుగానే రజస్వల అవడాన్ని గమనించారు. ఈ పరిస్థితిని సీపీపీ(సెంట్రల్ ప్రికాషియస్ ప్యుబర్టీ)అంటారు. ఒకవేళ పుట్టిన తొలి రెండు వారాల్లోనే ఆడపిల్లలకు యాంటీ బయోటిక్స్ ఇస్తే ఈ సమస్య ఇంకా ఎక్కువగా ఉందట. శరీరంలోకి చేరిన యాంటీ బయోటిక్స్ ఆడపిల్లల్లో హార్మోన్ల వ్యవస్థని అదుపుతప్పేలా చేయడం వల్లనే ఇలా త్వరగా రజస్వల అవుతున్నారని ఈ అధ్యయనం చెబుతోంది. అందువల్ల వీలైనంత వరకూ పిల్లలని ఆరోగ్యంగా ఉంచుతూ, యాంటీబయోటిక్స్ వాడకానికి దూరం పెడితే మంచిదంటున్నారు శాస్త్రవేత్తలు.



ఆంధ్రప్రదేశ్ దక్షిణ కోస్తా ప్రాంతాల్లో కాస్త స్థితిమంతులైన రైతుల్ని 'ఆసామి' అని పిలుస్తుంటారు... అన్నంపెట్టే దేవుడిలాంటివాడన్న అర్థంలో. అప్పుడే నాగలిపట్టిన యువరైతులూ, వ్యవసాయ కూలీలూ తామూ ఆసామి కావాలని కలలు కనేవాళ్లు ఒకప్పుడు. ఇప్పుడా పరిస్థితులు మారుతున్నాయి... వ్యవసాయ వృత్తికున్న ప్రాధాన్యం తగ్గుతోంది. కాడి పట్టి సాగులోకి దిగుతున్న యువత సంఖ్య తరిగి పోతోంది. అలాంటివాళ్లకి కొత్త ఉత్తేజాన్ని ఇస్తుంది శరభేశ్వర్ కథ! ఓ సామాన్య రైతుగా పద్మశ్రీని అందుకున్న ఆయన ప్రయాణం ఇది...





నాటి కూలీకి... 'పద్మశ్రీ' వచ్చింది!

ఓ చిన్న బనియనుతో, మోకాళ్ల వరకూ వస్త్రం చుట్టుకుని పొలాల వెంట తిరుగుతుంటాడు శరభేశ్వర్ బసుమతరి. అరవై రెండేళ్ల వయసులోనూ ఆరుగాలం శ్రమిస్తుంటాడు. అయితేనేం, ఆయన్ని చూడటానికి అప్పుడప్పుడూ జిల్లా కలెక్టరూ వస్తుంటాడు. వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లూ తమ సందేహాలు నివృత్తి చేసుకుంటారు. వీళ్లే కాదు, జాతీయస్థాయి మీడియావాళ్లూ అసోంలోని చిరాగ్ జిల్లాలో పాతిక ఎకరాల్లో విస్తరించిన ఆయన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించడం కద్దు. వాళ్ళ ద్వారానే శరభేశ్వర్ స్ఫూర్తిమంతమైన కథ కూడా వెలుగులోకి వచ్చింది...

అసోంలో చిరాగ్ జిల్లాలోని పన్బారి అనే అడవి అంచు పల్లె శరభేశ్వర్‌ది. అక్కడి భూస్వాముల ఇంట పనులు చేస్తుండేవారు అతని తల్లిదండ్రులు. పనిచేసిన రోజు కూలీ కింద బియ్యం ఇచ్చేవాళ్లు. ఆ బియ్యంతోనే ఎనిమిదిమంది సంతానం ఆకలి తీర్చుకునే వారు. పనులూ బియ్యమూ దొరకని రోజుల్లో అడవిలోకి వెళ్లి నాటు బంగాళాదుంపల్ని ఏరుకొచ్చి కాల్చి తినేవాళ్లు.

కాస్త పెద్దయ్యాక శరభేశ్వర్ రైతుల వద్ద పనికెళ్లడం మొదలుపెట్టాడు. 1980ల్లో తీవ్ర కరవొస్తే... ఆ పనులూ దొరక్క తల్లిదండ్రులతోపాటూ భవన నిర్మాణ కార్మికుడయ్యాడు. అక్కడా వాళ్లకి కూలీకింద ధాన్యాన్నే ఇచ్చేవారట. తన 15 ఏళ్ల వయసులో... మేఘాలయలోని బొగ్గుగనుల్లో కార్మికుడిగా వెళ్లినప్పుడే తొలిసారి డబ్బుని చూశాడట శరభేశ్వర్! 'ఆ డబ్బుని ఆదాచేసి పొలం కొని, ఎలాగైనా నేనూ ఓ రైతుని కావాలన్న కల నన్ను వెంటాడుతుండేది. చిన్నప్పటి నుంచీ ఆసాముల ఇళ్ళల్లో పని చేస్తూ... వాళ్లకున్న గౌరవమర్యాదల్ని చూడటం ఇందుకు కారణం కావొచ్చు' అంటాడు శరభేశ్వర్. 1900ల్లో అసోం సాయుధ పోరాటం ఫలితంగా... ఆ కల నెరవేరే రోజు వచ్చింది. అడవుల్ని నరికి పంటపొలాలుగా చేసుకోవచ్చని ప్రభుత్వం అనుమతులిచ్చింది. దాంతో అప్పటిదాకా భూముల్లేని ప్రజలు రైతులయ్యారు. అప్పటికి 18 ఏళ్లవాడైన శరభేశ్వర్ సొంత భూమి సాధించలేకపోయినా... కొంత పొలాన్ని కౌలుకి తీసుకోగలిగాడు. తానూ రైతునైపోయానని సంబరపడ్డాడు. కానీ జరిగింది వేరు...

అన్నీ నష్టాలే...

వ్యవసాయంలో అనుభవం లేకపోవడం వల్ల తీవ్ర నష్టాలపాలయ్యాడు శరభేశ్వర్. చుట్టూ ఉన్న రైతుల్ని చూసి తానూ మిరప, వంగ పంటల్ని వేసి చేతులు కాల్చుకున్నాడు. అలా- బొగ్గుగనుల్లో సంపాదించిన డబ్బు సాగు పెట్టుబడులకే సరిపోయింది. అప్పుడే మిగతా రైతులకన్నా భిన్నంగా వెళ్లాలన్న ఆలోచన వచ్చింది శరభేశ్వర్‌కి. బడిముఖం ఎరగని శరభేశ్వర్... అసోం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వెళ్లి తనకి కొత్త సాగు విధానాలు నేర్పించమని అడిగాడు. అలా, పోకచెట్ల సాగు నేర్చుకున్నాడు. వాళ్ల దగ్గరే తొలిసారి అంతరపంటల విధానాన్నీ తెలుసుకున్నాడు.

ఊరికి తిరిగి వచ్చి పోకచెట్ల నడుమ పసుపు, అరటిచెట్లని వేయడం మొదలుపెట్టాడు శరభేశ్వర్. ఏడాదిలోని మూడు సీజన్లలోనూ దిగుబడులు చూడసాగాడు. 1995లో తొలిసారి సొంతంగా ఎకరం పొలం కొన్నాడు. తాను అనుసరిస్తున్న పద్ధతులకన్నా మెరుగైన విధానాలని నేర్చుకోవాలని దేశమంతా తిరిగాడు. ఆంధ్రప్రదేశ్‌కి వచ్చి ఆధునిక పంట విధానాలపైన శిక్షణ తీసుకున్నాడు. అసోంలోని తమ వాతావరణానికి అనుగుణంగా వాటిని మార్చుకుని అనాస, నారింజ, బొప్పాయి పండ్ల వ్యవసాయాన్ని మొదలుపెట్టాడు. ఈసారి అతను పట్టిందంతా బంగారమైంది. తొమ్మిది ఎకరాలని కొని... మరో 15 ఎకరాలు కౌలుకి తీసుకుని సువిశాల వ్యవసాయ క్షేత్రంలో కొత్త ప్రయోగాలకి తెరతీశాడు...

అక్కడితో ఆగలేదు...

2007లో కేంద్ర మత్స్యశాఖ దగ్గర చేపల సాగుపైన శిక్షణ తీసుకుని తన పొలాల్లోనే నాలుగు చేపల చెరువులు తవ్వాడు. ఆ చెరువుల చుట్టూ చేపలసాగు వ్యర్థాలని ఎరువులుగా మార్చి... మరెన్నో కొత్త పండ్లరకాలని వేశాడు. 75 వేల మొక్కలతో నర్సరీని ఏర్పాటుచేశాడు. వీటికి పట్టుపురుగుల సాగునీ, పందుల పెంపకాన్నీ సమన్వయం చేశాడు. వీటన్నింటితో ఏటా రూ.10 లక్షలు సంపాదిస్తున్నాడు శరభేశ్వర్!

నాలుగు రూపాయల కూలీతో జీవితం మొదలుపెట్టి లక్షల్ని చూస్తున్న శరభేశ్వర్ విజయం... అనతికాలంలోనే అసోం రాష్ట్ర స్ఫూర్తిమంత్రంగా మారింది. యువరైతులు ఎక్కడెక్కడినుంచో వచ్చి ఆయన దగ్గర శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టారు. వాళ్లకి తన క్షేత్రంలోనే బస కల్పించి ఉచితంగానే నేర్పించడం మొదలుపెట్టాడు శరభేశ్వర్. రాష్ట్రమంతా తిరిగి యువత సాగువైపు రావాలని పిలుపునిస్తుంటాడు. పల్లె యువతకి ఇలా స్ఫూర్తిగా నిలిచినందుకే అసోం రాష్ట్రం తమ అత్యున్నత పురస్కారమైన 'అసోం గౌరవ్'ని అందించింది. దానికి కొనసాగింపుగానే 'పద్మశ్రీ' కూడా శరభేశ్వర్‌ని వరించింది. ★




ఫుడ్ ట్రెండ్



సపోటా పొడుగ్గా ఉంటే... వెలక్కాయ తియ్యతియ్యగా నోరూరిస్తే... సీతాఫలం గులాబీ రంగులో కనిపిస్తే... కాస్త ఆశ్చర్యమే కదూ. సరికొత్త ఆ వెరైటీ పండ్ల వివరాలేంటో తెలుసుకుందాం పదండి మరి!



రూబీ సీతాఫలం!





ఏడాదంతా ఎన్ని రకాల పండ్లు దొరికినా... సీతాఫలాల సీజన్ కోసం కొంతమంది ప్రత్యేకంగా ఎదురుచూస్తుంటారు. పండు నిండా గింజలు ఉన్నా ఓపిగ్గా వాటిని తీసుకుంటూనే దాని తీపి గుజ్జును ఆస్వాదించేస్తుంటారు. పిల్లలైతే కమ్మటి ఈ పండును లొట్టలేసుకుంటూ తినేస్తారు. కొత్తగా ఈ సీతాఫలాల్లో- కేకు రుచిలో, గులాబీ-ఎరుపు రంగులో, రూబీ రెడ్ కస్టర్డ్ యాపిల్ వెరైటీ పండ్లూ దొరుకుతున్నాయి. చూడ్డానికి కంటికింపుగా ఉండటంతోపాటు తక్కువ గింజలతో ఉండే ఈ పండులో తియ్యదనమూ ఎక్కువేనట. అందుకే స్మూతీల తయారీలో, స్వీట్ల గార్నిషింగ్‌లోనూ దీన్ని వేస్తుంటారు. మామూలు సీతాఫలాలతో పోలిస్తే వ్యాధినిరోధక శక్తిని పెంచే గుణం వీటికి ఎక్కువగా ఉంటుందట. జలుబూ, ఇతర వ్యాధుల నుంచి రక్షణ కోసం వీటిని తింటే సరి.



తియ్యటి వెలక్కాయ!



కాస్త వగరుగా, మరికాస్త పుల్లగా ఉండే వెలక్కాయ రుచి అందరికీ తెలిసిందే. అయితే ఫ్రూట్ సలాడ్, మిఠాయిల్లాంటివాటిల్లో ఈ పండును చేర్చుకోలేం. అంతసులువుగా దీన్ని తినలేం కూడా. కానీ ఈ థాయ్ వెలక్కాయని మాత్రం ఆ ఇబ్బంది లేకుండా సులువుగా తినొచ్చు. ఎందుకంటే మనసుని కట్టిపడేసే సువాసనతో ఉండే ఈ వెలక్కాయ జ్యూసీ జ్యూసీగా మెత్తటి గుజ్జుతో నోరూరిస్తుంది. అంతేకాదు, తియ్యగా ఉండటమే ఈ పండు అసలైన విశేషం. ఈ హైబ్రిడ్ రకాన్ని థాయ్‌లాండ్‌లో ఎక్కువగా సాగు చేస్తుంటారు. మన దగ్గరా ఈ కొత్త రకం వెలగ మొక్కలను పెంచుతున్నారు. చలికాలంలో వచ్చే వైరల్ ఇన్‌ఫెక్షన్లను దూరం చేసే ఈ పండుతో పచ్చడి పెడితే అద్భుతమైన రుచీ ఉంటుంది.. పోషకాలూ అందుతాయి.



బనానా సపోటా!



మామూలుగా సపోటా అనగానే గోధుమ రంగు తోలుతో గుండ్రంగా ఉండే పండే గుర్తుకొస్తుంది ఎవరికైనా. కానీ ఇక్కడున్న పండును కాస్త గమనించండి. చిన్న అరటి పండులా పొడుగ్గా కాస్త చిత్రంగా ఉంది కదూ. ఆ వింత రూపం వల్లే దీన్ని బనానా సపోటా అని పిలుస్తారు. ఈమధ్య నర్సరీల్లో, మిద్దె తోటల్లో ఈ బనానా సపోటా వెరైటీని ఎక్కువగా పెంచుతున్నారు. మెక్సికో, మధ్య అమెరికాకు చెందిన ఈ పండు- ఒక్క ఆకృతిలోనే కాదు, రుచిలోనూ ప్రత్యేకమైందే. మిగిలిన సపోటాల కన్నా ఎంతో తియ్యగా చాక్లెట్‌లా ఉంటుందీ పండు. నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే ఈ బనానా సపోటాని మిల్క్‌షేక్స్, స్వీట్లూ, ఐస్‌క్రీమ్‌ల తయారీల్లో విరివిగా వాడుతుంటారు. సపోడిల్లాగానూ పిలిచే ఈ పండులో రక్తపోటుని అదుపుచేసే పొటాషియం పుష్కలంగా ఉంటుంది. అదొక్కటే కాదు- మామూలు సపోటాతో పోలిస్తే దీనిద్వారా పీచు, విటమిన్-సి, ఐరన్, యాంటీఆక్సిడెంట్లలాంటి పోషకాలూ అధికంగా అందుతాయట.







జాగృతి గీతం... 150 వందే మాతరం!

వందేమాతర గీతం...
అవమాన గాయంలోంచి పుట్టుకొచ్చిన గేయం. 'అమ్మ' అన్న పిలుపులోని ఆప్యాయత, ప్రేమ, భక్తి రంగరించి రాసిన సంక్షిప్త కావ్యం. దాన్ని ఆధ్యాత్మికవేత్తలు 'సాక్షాత్తు రుషి వాక్కు'గా అభివర్ణిస్తే.... ఉద్యమకారులు 'పోరాట స్ఫూర్తి కేంద్రం'గా ప్రకటించుకున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ సమస్త జాతినీ ఒక్కటి చేసిన ఆ సమర నినాదానికి సరిగ్గా 150 ఏళ్లు!

'నల్లవాడివి. నీకు పల్లకీ కావాల్సి వచ్చిందా? తక్షణం దిగిపో...' అని రంకెలేస్తూ వస్తున్నాడతను. ఆ అరుపులకు బోయీలు భయపడిపోయారు. ఠక్కున ఆగిపోయారు. లోపల కూర్చుని ఉన్న బంకిమ్‌చంద్ర మేనా ఎందుకు ఆగిందో తెలుసుకునేలోపే... ఓ తెల్లవాడు దూసుకొచ్చాడు. వచ్చీ రావడంతోనే, బంకిమ్‌చంద్రను బయటకు లాగి, ముఖం మీద పిడిగుద్దులు గుద్దాడు. అంతలోనే, ఎవరో 'కల్నల్..! ఆయన మన డిప్యూటీ మేజిస్ట్రేట్ బంకిమ్‌చంద్ర ఛటోపాధ్యాయ!' అని సర్దిచెప్పబోయారు. 'అయితే... ఏంటి?' అన్నాడా తెల్లదొర. 'అయితే ఏమిటా... ఇంతకి రెండింతలు అనుభవిస్తావ్ చూసుకో...' అని రోషంగా జవాబిచ్చాడు బంకిమ్‌చంద్ర పైకిలేస్తూ. ఆ కోపానికి జంకిన తెల్లవాడు 'సారీ' అన్నట్టు పెదాలు కదిలించాడు. 'ఇక్కడ కాదు కోర్టులో చెప్పు ఆమాట' అని సూటిగా బదులిచ్చి ముందుకు కదిలాడు బంకిమ్‌చంద్ర. నేరుగా వెళ్లి తన మీద చేయి చేసుకున్న లెఫ్టినెంట్ కల్నల్ డఫిన్‌పైన క్రిమినల్ కేసు పెట్టాడు. వెంటనే విచారణ మొదలైంది. కానీ జడ్జి కోర్టు గదిలోకి రావడానికి ముందు బంకిమ్‌చంద్రని తన ఛాంబర్‌కి పిలిచాడు. అప్పటికే అక్కడ డఫిన్ ఉన్నాడు. 'ఈయన డిప్యూటీ మేజిస్ట్రేట్ అనే విషయం నాకు నిజంగానే తెలియదు' అంటూ అమాయకత్వం నటించాడు ఆ తెల్లదొర. జడ్జి కూడా అంతే నాటకీయంగా బంకిమ్‌చంద్ర వైపు చూసి 'పాపం... తెలియక చేశాడట. కేసు ఉపసంహరించుకోండి' అని సలహా ఇచ్చాడు. 'కుదర్దు' కచ్చితంగా చెప్పాడు బంకిమ్‌చంద్ర. 'ఇలా ఇద్దరు ఉన్నతాధికారులు గొడవపడటం బ్రిటిష్ సామ్రాజ్యానికి మాయని మచ్చ తెస్తుంది' అన్నాడు జడ్జి. 'సరే... నేను కేసు విత్‌డ్రా చేసుకుంటాను. కానీ అతను బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి' అని షరతు విధించాడు బంకిమ్‌చంద్ర. జడ్జి ఒప్పుకోక తప్పలేదు. అలా నిండు న్యాయస్థానం సాక్షిగా క్షమించమని కోరాడు డఫిన్. అయినా, బంకిమ్‌చంద్ర గుండెల్లోని అవమానాగ్ని చల్లారలేదు. 'నేను బెంగాల్‌లో తొలి భారతీయ ఐసీఎస్ ఆఫీసర్ని. నన్నే ఇలా అవమానిస్తే... సామాన్యుల పరిస్థితి ఇంకెలా ఉంటుందీ?' అనుకున్నాడు. దీర్ఘకాలిక సెలవు తీసుకుని, కోల్‌కతాకు బయల్దేరాడు. అంతలోనే పిడుగుపాటు లాంటి సమాచారం... బ్రిటిష్ ప్రార్థనాగీతం 'గాడ్ సేవ్ ద కింగ్'ని 'భారత జాతీయ గేయం'గా ప్రకటించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందట! ఆ వార్త బంకిమ్‌చంద్ర ఆవేశానికి ఆజ్యం పోసింది. పెల్లుబికిన ఆ ఆగ్రహమే ఆయన కలం నుంచి పాట రూపంలో జాలువారింది...

వందేమాతరం
సుజలాం సుఫలాం
మలయజ శీతలాం...
సస్యశ్యామలాం మాతరం.
శుభ్రజ్యోత్స్న పులకిత యామినీం
పుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం.
వందేమాతరం

... ఈ రెండు పాదాలనూ బంకిమ్‌చంద్ర 1875, నవంబరు 7న రాశాడని అంటారు. అప్పటికే అతను బెంగాల్‌లో ఆధునిక సాహితీ సమ్రాట్టుగా సుప్రసిద్ధుడు, వచన రచనలో సిద్ధహస్తుడు. భారతదేశానికి నవలా ప్రక్రియను పరిచయం చేసినవాడిగానూ సుపరిచితుడు. బంకిమ్‌చంద్ర రాసిన 'దుర్గేశనందిని', 'అనుశీలన మిత్ర' వంటి నవలలు బెంగాల్‌లో కొత్తతరం పాఠకులను ఆకట్టుకుంటున్న సమయం అది. కానీ ఆయన 'వందేమాతరం' మాత్రం పండితులకి పెద్దగా నచ్చలేదు, పామరులకు ఏమాత్రం అర్థం కాలేదు.

విసిరికొట్టండి...

'గేయాన్ని సంస్కృతం-బెంగాలీ భాషల కలగాపులగంగా రాయడం దుష్టసంప్రదాయం' అన్నది నాటి వయాకరణుల అభ్యంతరం. ఆ విమర్శలకు విసిగిపోయి, 'మీకు నచ్చితే చదవండి... లేకుంటే విసిరి అవతల పారేయండి' అనేవాడట బంకిమ్. ఓసారి ఆయన నడుపుతున్న పత్రికలో కాస్త స్థలం మిగిలిపోతే, 'ఈ ఖాళీలో మీ కవితను పెడదామా?' అని అడిగాడట ఉప-సంపాదకుడు. 'అది ఫిల్లర్‌లా వేయడానికి రాసింది కాదు. దాని విలువ ప్రపంచానికి తెలిసే రోజు వస్తుంది. అప్పటికి నేనూ ప్రాణాలతో ఉండకపోవచ్చు కూడా' అని స్థిరంగా చెప్పాడట బంకిమ్. ఆ మాటే నిజమైంది. ఆయన బతికున్నంత కాలం వందేమాతర గీతం సామాన్యులకు చేరలేదు. ఆలోపు దానికి మరో రెండు పాదాలు చేర్చి ప్రార్థన గీతంగా తన 'ఆనందమఠ్' నవలలో ఉపయోగించాడు. 1777లో బ్రిటిష్‌వాళ్లపైన పోరాడిన సన్యాసుల జీవితాలకు అక్షర రూపమే ఈ నవల. ఈ పుస్తకం సంచలనం సృష్టించినా, గేయం మాత్రం పెద్దగా

ప్రాచుర్యం పొందలేదు.
అయితేనేం, మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అందులోని గాఢతను గుర్తించాడు. దేశాన్ని మాతృమూర్తిగా అభివర్ణించిన తీరు ఆయనను ఆకట్టుకుంది. తానే స్వయంగా బాణీకట్టి 1886లో జరిగిన కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో హృద్యంగా ఆలపించాడు. మరో తొమ్మిదేళ్ల తర్వాత... అంటే, 1895లో బంకిమ్ చనిపోయాడు. ఆయన ఊహించినట్టే... అప్పటికీ ఆ పాట పెద్దగా ప్రజల్లోకి వెళ్లలేదు. ఆ మహత్తు జగత్తుకు తెలియడానికి ఇంకో పదేళ్లు పట్టింది. 'బెంగాల్ విభజన' సమయంలో... ఆ అక్షరాలు అగ్ని కణికలై మండాయి.

దావానలంలా...

1905... అక్టోబర్ 16. ఆ రోజు శ్రావణ పౌర్ణమి... రక్షా బంధన్. ఆంగ్లేయులు బెంగాల్ విభజనని అమలు చేసిన రోజు! 1857నాటి తొలి స్వాతంత్ర్య సంగ్రామంలో తమకి ముచ్చెమటలు పట్టించిన హిందూ-ముస్లిం ఐక్యతని దెబ్బతీయడం ఆ నిలువుకోత ప్రధాన ఉద్దేశం. తెల్లవారి నిర్ణయానికి వ్యతిరేకంగా కోల్‌కతా ప్రజానీకం టౌన్‌హాల్ దగ్గర పెద్ద ఎత్తున గుమికూడింది. ఆ సమూహానికి ఠాగూర్ నేతృత్వం వహించారు. అమ్మాయిలు తమ సోదరులకి రక్షాబంధన్ కట్టే పద్ధతినే కాస్త మార్చి... హిందూ-ముస్లింలు ఒకరికొకరు రాఖీలు కట్టుకోవాలని పిలుపునిచ్చారాయన. ఆ సందర్భంగా దేశమాతని స్మరించుకునేలా 'వందేమాతరం' గీతాన్ని ఆలపించారు. ఆయన్ని అనుసరిస్తూ... వీధివీధినా 'వందేమాతరం' నినాదాలు చేశారు. చూస్తుండగానే అది మంత్రమైంది... మహోపదేశమైంది. బెంగాల్ విభజనకి వ్యతిరేకంగా 'స్వదేశీ ఉద్యమాన్ని' మొదలుపెట్టిన కాంగ్రెస్ నేతలు ఆ పాటని అపురూపంగా అందుకున్నారు. ముఖ్యంగా బిపిన్ చంద్రపాల్ వందేమాతర గీతాన్ని దేశానికంతా పరిచయం చేశాడు.

విప్లవ సాహిత్యం!

వందేమాతరం నినాదాన్నీ, గేయాన్నీ వాయువేగంతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా తీసుకెళ్లారు బెంగాలీ విప్లవకారులు. వివిధ భాషల్లో కరపత్రాలుగా ముద్రించి పంచారు. అదే పేరుతో పత్రికలూ నడిపారు. ఆ సాయుధ దళాల ముఖ్యనేత అరవింద్ ఘోష్ (తర్వాతి కాలంలో అరవింద యోగి అయ్యారు) మొదటిసారిగా వందేమాతర గీతాన్ని ఇంగ్లిషులోకి అనువదించాడు. ఆ ప్రతి 1905-1907 మధ్య దక్షిణాది భాషలన్నింటిలోకీ తర్జుమా అయ్యింది. 1906లో పాథేఫోన్స్ కంపెనీ దాన్ని గ్రామఫోన్ రికార్డుగా తీసుకొచ్చింది. మరో ఏడాది తర్వాత కానీ, బ్రిటిష్ పాలకులు ఆ గేయ తీవ్రతను గ్రహించలేకపోయారు. 'ఆనందమఠ్' నవలలో భాగమైన వందేమాతరం గీతంలోని చివరి పాదాల్లో ప్రస్తావించిన దుర్గమ్మను మృత్యుదేవతగా అభివర్ణించుకున్నారు. అందులోని 'రాక్షసులు' అనే మాటను తమకు అన్వయించుకున్నారు. ఆ పాటపైన నిషేధాజ్ఞలు విధించారు. ఆ నిరంకుశమైన నిర్ణయం భారతీయుల్లో ఆగ్రహాన్ని పెంచింది. కార్మికులూ కర్షకులూ రైతులూ మహిళలూ... ఒకరేమిటి, సమస్త ప్రజానీకం పోరాటయోధులుగా మారారు. భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో 1905-11 మధ్య కాలాన్ని 'వందేమాతర యుగం' అంటున్నా, ఆ ప్రభావం 1947 వరకూ మహోజ్జ్వలంగా కొనసాగింది.

చెయ్యెత్తి జైకొట్టిన తెలుగోడు!

అది 1907వ సంవత్సరం. ఫిబ్రవరిలో 'వందేమాతరం' గీతం రాజమహేంద్రి యువతని తొలిసారిగా ఉద్యమం వైపు నడిపించింది. అక్కడి విద్యార్థులు ఆ గీతాన్ని ఎలుగెత్తి పాడుతూ ఊరేగింపుగా నడిచారు. ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఆ బృందానికి నాయకుడు. ఈ పరిణామాన్ని ప్రిన్సిపల్ హంటర్ సహించలేకపోయాడు. విద్యార్థులకు ఓ హెచ్చరికగా... హరిసర్వోత్తమరావుని కాలేజీ నుంచి బహిష్కరించాడు. అయినా, ఎవరూ బెదరలేదు. మరింత పట్టుదలతో ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. నెల రోజుల తర్వాత, బెంగాల్ నుంచి బిపిన్ చంద్రపాల్ స్వయంగా అక్కడికి వచ్చాడు. ఆయనకి హరిసర్వోత్తమరావే స్వాగత పత్రం అందజేశాడు. ఆ పరిణామంతో మరింత రెచ్చిపోయిన హంటర్... హరిసర్వోత్తమరావుకి ఎక్కడా ఉద్యోగం రాకుండా మద్రాసు ప్రెసిడెన్సీ అధికారుల నుంచి ప్రత్యేక ఆదేశాలు తెప్పించాడు. దాంతో... అప్పటిదాకా కొద్దిమందికే పరిమితమైన ఉద్యమంలోకి విద్యార్థిలోకమంతా ఉత్సాహంగా దూకింది. హంటర్ 138 మందిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చాడు. ఆ నిర్ణయంతో రాజమహేంద్రవరం అట్టుడికిపోయింది. విద్యార్థులకి మద్దతుగా గ్రామాల్లోనూ 'వందేమాతరం సంఘాలు' వెలిశాయి. ఆంగ్లేయులు ఎక్కడ కనిపించినా... 'వందేమాతరం!' అంటూ నిరసన తెలపడం నిత్యకృత్యమైంది. ఆ వేడి కోటప్పకొండ తిరునాళ్ల దాకా పాకింది...

చేబ్రోలు దగ్గర ఉన్న రెడ్డిపాలెం గ్రామానికి చెందిన రైతు... చిన్నపరెడ్డి. కోటప్ప తిరునాళ్ల కోసమని ప్రభని కట్టుకుని వచ్చాడు. అతని కోడెదూడలు జనాన్ని చూసి బెదిరిపోయి అటూఇటూ పరుగెత్తాయి. చిన్నపరెడ్డి అదిలించి అదుపులోకి తీసుకొస్తుండగానే... ఓ ఇంగ్లిషు పోలీసు అధికారి దురుసుగా తుపాకీ తీసి ఓ ఎద్దును కాల్చేశాడు. తన ప్రాణానికి ప్రాణమైన మూగజీవం కుప్పకూలడంతో చిన్నపరెడ్డి

ఎన్నో ప్రత్యేకతలు...

రెండింటికీ సమాన హోదాయే ఉన్నా 'జనగణమన' పాడటానికి... చాలా కట్టుబాట్లు ఉన్నాయి. ఆ బాణీని ఎవరూ మార్చకూడదు, పాడే సమయమూ (52 సెకన్లు) మారకూడదు. వందేమాతరానికి ఆ పరిమితులు లేవు. కాబట్టే వేలాది వెర్షన్లు వచ్చాయి.


★ 1947 ఆగస్టు 15... మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన రోజున ప్రఖ్యాత సంగీతకారుడు ఓమ్‌ప్రకాశ్ వందేమాతర గీతాన్ని పార్లమెంటులో ఆలపించారు. ఏ వాద్య సంగీతమూ లేకుండా... అచ్చమైన గాత్రాన్ని వినిపించారు. పాటలోని మాధుర్యం, పదాల్లోని భావతీవ్రత సంగీతం మాటున మిగిలిపోకూడదని అలా పాడించారని చెబుతారు!

★ దూరదర్శన్‌లో ప్రతిరోజూ సుప్రభాత గీతంగా వినిపించే వందేమాతరానికి నేపథ్య సంగీతం ఉండదు. దానికి కూడా ఇదే కారణమని అంటారు.

★ బీబీసీ వరల్డ్ సర్వీస్ నిర్వహించిన అంతర్జాతీయ పోల్‌లో... ప్రపంచ ప్రసిద్ధ జాతీయ గేయాల్లో రెండో స్థానం అందుకుంది వందేమాతరం. మొదటి స్థానం ఐర్లాండ్ స్వాతంత్ర్య దినోత్సవ గీతానికి దక్కింది.

★ 1906లో పాథేఫోన్స్ కంపెనీ వందేమాతర గీతాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ గళంలో గ్రామఫోన్ రికార్డుగా తెచ్చింది! ఆ తర్వాతి సంవత్సరమే ఆ కాపీలన్నింటినీ బ్రిటిష్ పోలీసులు ధ్వంసం చేసేశారు. దానికి సంబంధించిన ఒరిజినల్ ప్రతి చాలారోజులు పారిస్‌లోనే ఉండిపోయింది. 1966లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ దాన్ని మళ్లీ కాపీచేయించి మనదేశానికి తెప్పించారు.





ఆ ఇంగ్లిషు అధికారిపైన తిరగబడ్డాడు. 'వందేమాతరం!' అంటూ ఇతర రైతులతో కలిసి అధికారిని చితకబాదాడు. ఆ నేరానికి ఇంగ్లిషు ప్రభుత్వం చిన్నపరెడ్డి సహా ముగ్గురికి ఉరిశిక్ష విధించింది. ఆ శిక్షను అమలు చేసిన రోజు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 'వందేమాతరం' నినాదం మారుమోగింది.

స్ఫూర్తి మంత్రమై...

స్వాతంత్ర్య పోరాటంలో... వందేమాతర గీతం ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చింది. సామాన్యులనూ సమరయోధులుగా మార్చింది. బెంగాల్ సాయుధ పోరాట దళం నుంచి ఉరిశిక్షకి గురైన తొలి యోధుడు... కుదిరామ్ బోస్. బ్రిటిష్ మేజిస్ట్రేట్ కింగ్స్‌ఫోర్డ్ హత్యాయత్నం కేసులో అతను దోషిగా అరెస్టయ్యాడు. 1908, ఆగస్టు 11న ఉరిశిక్ష ఖరారైంది. ఆ సందర్భంగా న్యాయమూర్తి, 'నువ్వేమైనా చెప్పదలచుకున్నావా?' అని అడిగాడు. తల అడ్డంగా ఊపి, 'వందేమాతరం!' అంటూ చిరునవ్వుతో ఉరికొయ్య వైపు నడిచాడు కుదిరామ్. అప్పటికి అతని వయసు పద్దెనిమిదేళ్లే! ఆ వీరుడి భౌతికకాయాన్ని తీసుకెళ్తుంటే... కోల్‌కతా వీధులు ప్రజలతో కిక్కిరిసిపోయాయి. అందరి నినాదం... వందేమాతరం!

ఉప్పు సత్యాగ్రహం సమయంలో... బుధు నోనియా అనే బిహారీ బాలుడు 'వందేమాతరం' అంటూ ఉప్పు కాసేచోట తిరగసాగాడు. అదంతా చూసిన ఓ బ్రిటిష్ పోలీసు ఒళ్లు తెలియని ఆవేశంతో... ఆ పసివాణ్ణి ఉప్పు కొలిమిలోకి విసిరేశాడు! ఆ పరిస్థితుల్లోనూ ఆ చిన్నారి 'అమ్మా... అమ్మా...' అని అరవలేదు. ప్రాణాలు గాల్లో కలిసేదాకా 'వందేమాతరం' అంటూనే ఉన్నాడు!

మాతంగి హజ్రాకి పన్నెండేళ్లకే పెళ్లయింది... పద్దెనిమిది అయినా నిండకుండానే వితంతువైంది. అరవై ఏళ్ల వయసులో గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య సమరంలోకి అడుగుపెట్టింది. 1942 సెప్టెంబర్ 29న పశ్చిమ్‌బంగ మిడ్నాపూర్ జిల్లా పోలీసు స్టేషన్ ముందు అనేకమంది మహిళలతోపాటూ ఆమె ధర్నా చేస్తుంటే... పోలీసులు హఠాత్తుగా కాల్పులకి దిగారు. 'అందర్నీ వద్దు... నన్ను కాల్చు' అంటూ ఒంటరిగా ముందుకెళ్లింది హజ్రా. ఆమె ఒక్కో అడుక్కీ... ఒక్కో తూటాని పేలుస్తూనే వచ్చారు పోలీసులు. ప్రతి దెబ్బకూ 'వందేమాతరం' అంటూ నినదించింది హజ్రా. నేలకి ఒరిగేదాకా అదే నినాదం.

తెలంగాణలోనూ వందేమాతరం విద్యార్థి ఉద్యమంగానే రాజుకుంది. 1938 నవంబర్ 28న బి హాస్టల్ కమ్యూనిటీ హాలులో సమావేశమైన ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు వందేమాతరం గేయాన్ని గళమెత్తి పాడారు. అది సహించని అధికారులు వాళ్లని లోపలే బంధించి తాళం వేశారు. సాయంత్రానికి వదిలేసినా... ఆ తర్వాతి రోజు నుంచీ క్లాసులకి అనుమతించలేదు. హాస్టల్ నుంచి బయటకు వెళ్లనివ్వలేదు. దాంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ధర్నాకి దిగారు. చూస్తుండగానే ఆ ఉద్యమం హైదరాబాద్‌లో మొదలై నిజాం రాజ్యం మొత్తం పాకింది. పాలకులకు చెమటలు పట్టాయి. అలా ఆ నిరసనల్లో పాల్గొన్న 1550 మంది విద్యార్థుల్నీ విద్యాసంస్థ నుంచి బహిష్కరించారు. దేశంలోని ఏ యూనివర్సిటీ వాళ్లకు సీటివ్వకూడదని కఠినంగా ఆదేశించారు. అయినా సరే, నాగ్‌పూర్ విశ్వవిద్యాలయం వారికి అవకాశం ఇచ్చింది. అలా అక్కడ చదివిన విద్యార్థుల్లో మాజీ ప్రధాని పీవీ నరసింహారావూ ఒకరు!

విభజన మొదలు..!

1920 వరకూ వందేమాతరం... స్వాతంత్ర్య సంగ్రామంలో అన్ని మతాలవారి ఉమ్మడి నినాదంగానే ఉండేది! విభజించి పాలించడంలో నేర్పరులైన బ్రిటిషువారు ఆ గేయానికి హిందువుల ప్రార్థనా గీతమనే దుష్ప్రచారం కల్పించారు. ఈ భావనకి 1920-30లలో చోటుచేసుకున్న మతకల్లోలాలు మరింత ఆజ్యం పోశాయి. కాంగ్రెస్ మాత్రం మొదటి నుంచీ వందేమాతరాన్ని జాతీయ గీతంగా ప్రకటించాలనే ఉద్దేశంతోనే ఉంది. కానీ... కొందరు ముస్లిం నేతల నుంచి అభ్యంతరాలు రావడంతో 1937 నాటి సమావేశంలో ఓ కచ్చితమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అప్పుడే రవీంద్రనాథ్ ఠాగూర్ సాయం కోరారు నెహ్రూ. పాటలోని తొలి రెండు పాదాలూ ఏ మతానికీ వ్యతిరేకం కావని స్పష్టం చేశారు ఠాగూర్. అయినా కాంగ్రెస్ వెనకడుగు వేసింది. పార్టీ పెద్దల తీరు వల్ల సుభాష్ చంద్రబోస్‌లాంటివాళ్లు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఆ ఉదాసీనత మహాత్మాగాంధీని కూడా బాధపెట్టిందని అంటారు. 'నన్ను ఎంతగానో కదిలించిన గీతమిది. నేటికీ కోట్లాది గుండెల్లో నినదిస్తోంది. ఏం చేద్దాం... ఒక్కోసారి మేలిమి బంగారాన్ని కూడా మామూలు లోహంలా పరిగణించాల్సిన పరిస్థితి దాపురిస్తుంది' అన్నారాయన బాధగా. మౌలానా అబుల్ కలాం అజాద్‌లాంటి నేతలైతే, తాము పాల్గొనే ప్రతి సమావేశంలోనూ ఈ పాట ఉండితీరాలని చెప్పేవారు!

1947లో స్వాతంత్ర్యం సిద్ధించిన రోజు... వందేమాతరాన్నే తొలి విజయగీతంగా ఆకాశవాణిలో వినిపించారు! దాంతో, అప్పటి వరకూ ఉన్న నిషేధమూ తొలగిపోయింది. ఇక, 1950 రాజ్యాంగ పరిషత్తు చివరి సమావేశం 'వందేమాతరం గేయాన్ని... రవీంద్రుడి జనగణమన జాతీయగీతంతో సమానంగా గౌరవించాలి... అదే స్థాయి హోదాని కల్పించాలి' అంటూ తీర్మానించింది.

అసతోమా సద్గమయ... అనే వేదవాక్యమూ, సత్యమేవ జయతే... ఉపనిషత్తు పాఠమూ, జననీ జన్మభూమిశ్చ... రామాయణ శ్లోకమూ, మా ఫలేషు కదాచన... గీతా ప్రబోధమూ, నో దై సెల్ఫ్... సోక్రటీస్ సూత్రమూ, పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప... అనే మార్క్స్ నినాదమూ ...మనిషి వికాసానికి మైలురాళ్లుగా నిలిచిన వాక్యాలు. 'వందేమాతరం' కూడా నిస్సంశయంగా ఆ కోవకి చెందిందే. ★



ఇవి రోబో బాతులు....

రెక్కలని ఆర్చుకుంటూ నీటిపైన అలాఅలా తేలుతూ వెళ్లిపోయే తెల్లటి బాతులు చూడ్డానికి భలే ఉంటాయి కదా! సింగపూర్‌లోనూ అలాంటి దృశ్యాలు చాలానే కనిపిస్తాయి కానీ, నీటిపైన తేలుతూ వెళ్లే వాటిల్లో అన్నీ నిజమైన బాతులు ఉండకపోవచ్చు. ఎందుకంటే వాటిల్లో కొన్ని బాతు రూపంలో ఉన్న రోబోలు కూడా ఉంటాయి. ఇలా రోబో బాతులని తయారుచేయాల్సిన అవసరం ఆ దేశానికి ఎందుకు వచ్చిందంటే... నదులూ, రిజర్వాయర్లూ, చెరువులూ, కుంటలూ... ఎక్కడైనా సరే నీటి నాణ్యత విషయంలో సింగపూర్ రాజీపడదు. అందుకే, దేశంలోని నీటి నాణ్యతా ప్రమాణాలని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కొన్నేళ్ల క్రితం 'స్వాన్' అనే ప్రాజెక్ట్‌కి శ్రీకారం చుట్టింది. స్వాన్ అంటే స్మార్ట్ వాటర్ ఎసెస్‌మెంట్ నెట్‌వర్క్ అని అర్థం. ఇందులో భాగంగా బాతు రూపంలో తయారుచేసిన రోబోలు... రిజర్వాయర్లూ, చెరువులూ, నదుల్లో తిరుగుతూ నీటి పీహెచ్ విలువ, ఆక్సిజన్ శాతం, క్లోరోఫిల్ ఎంత ఉందీ వంటి వివరాలని అధికారులకి ఎప్పటికప్పుడు అందిస్తాయి. వీటికున్న శక్తిమంతమైన కెమెరాలు ఫొటోలు తీసి అధికారులకి చేరవేస్తాయి. ఆ వివరాల ఆధారంగా వారు తగిన చర్యలు తీసుకుంటూ నీటి నాణ్యతని కాపాడుకుంటున్నారు.

బిడ్డ పుడితే... చందనం చెట్లు

ఆ ఊర్లో బిడ్డ పుడితే... ఆ పాప పేరుతో రెండు చందనపు చెట్లని నాటుతారు. ఆ బిడ్డని ఎంత అపురూపంగా పెంచుతారో, ఆ చెట్లని కూడా అంతే జాగ్రత్తగా పశువులు తినకుండా, ఎండిపోకుండా, దొంగతనానికి గురికాకుండా కాపాడతారు. పిల్లలు పెద్దయ్యాక వాళ్ల చదువులకోసం, పెళ్లి ఖర్చుల కోసం ఆ చెట్లని అమ్మేస్తారు. అరెరె... భలే ఉందే వాళ్ల ముందు చూపు అనుకుంటున్నారా? అవును, బిహార్‌లోని వైశాలీ జిల్లాలో ఉన్న పకౌలీ గ్రామంలో ఎన్నో దశాబ్దాలుగా ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు. బిడ్డ పుట్టగానే 'మల్యగిరి' అనే అద్భుతమైన సువాసనలు పంచే చందనపు జాతి మొక్కలు రెండింటిని కచ్చితంగా నాటతారు. పిల్లలతోపాటే అవీ పెరుగుతాయి. అలా పెరిగిన ఒక్కో చెట్టు ధర రూ. రెండు లక్షల వరకూ పలుకుతుందట. పక్కనే ఉన్న హరియాణా వ్యాపారస్తులు వీటిని కొనుక్కుంటారు. అవసరాన్నిబట్టి పిల్లల చదువుకోసం ఒక చెట్టుని తీసేస్తారు... ఆ తర్వాత పెళ్లి ఖర్చుల కోసం మరో చెట్టుని తీసేస్తారట. ఆ గ్రామంలో 700 కుటుంబాలు ఉంటే ప్రస్తుతం 900 చందనపు చెట్లు ఉన్నాయక్కడ. కష్టం వచ్చినప్పుడూ, అవసరంలో ఉన్నప్పుడూ అయినవాళ్ల కన్నా మేం ఈ చెట్లనే ఎక్కువగా నమ్ముకుంటాం అంటున్నారు అక్కడి స్థానికులు.



అవీ ఇవీ

స్టవ్ మారిస్తే... డబ్బులిస్తారు!

ఎక్కడైనా కొత్త వస్తువు కొనాలంటే డబ్బులు ఖర్చు పెట్టాలి కదా! కానీ ఝార్ఖండ్‌లో మాత్రం కొత్త స్టవ్ కొంటే ఎదురు డబ్బులొస్తాయి. ఇదేదో భలే ఉందే అనుకుంటున్నారా? నిజమే, ఇక్కడ ప్రజలు కట్టెల పొయ్యిని వదిలేసి దాని స్థానంలో పొగరాని కొత్త రకం స్టవ్‌ని కొనుక్కుంటే వాళ్లకి ప్రభుత్వం ఏటా రూ.1500 చొప్పున ఆరేళ్లపాటు డబ్బులిస్తుంది. ఇలా ఎందుకు ఇస్తున్నారంటే... కట్టెల పొయ్యి తెచ్చే చిక్కులు తక్కువేమీ కాదు. వాటి నుంచి వచ్చే పొగ వల్ల ఆరోగ్యం పాడవుతుంది. భారీగా చెట్లనీ కొట్టాల్సి ఉంటుంది. కట్టెలు కొట్టడానికి వెళ్లినప్పుడు అడవిలోని క్రూరమృగాలు మీదపడి దాడిచేసే అవకాశమూ ఎక్కువే. ఈ సమస్యలకు పరిష్కారంగా అక్కడి అటవీశాఖ, సిధ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి కాలుష్యాన్ని నివారించేందుకు ఇలా వినూత్నంగా అడుగులు వేస్తోంది. కాలుష్యాన్ని తగ్గించినందుకు విదేశాల నుంచీ 'కార్బన్ క్రెడిట్స్' రూపంలో అందే డబ్బునే ఇలా ప్రజల ఖాతాల్లో వేస్తోంది. ఈ విధానంలో ఆరోగ్యం మెరుగవ్వడమే కాకుండా ఏటా కొంత అదనపు ఆదాయం కూడా రావడంతో ప్రజలు ఉత్సాహంగా కాలుష్య రహిత స్టవ్‌ల వాడకం మొదలుపెట్టారట. దీనివల్ల కట్టెల పొయ్యి వాడకం 80శాతం తగ్గిందని స్థానిక అధికారులు అంటున్నారు.



అరటి నారతో యూనిఫాం!

చిన్నారులు ధరించే స్కూల్ యూనిఫాం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా అది వాళ్లకు ఇబ్బందే. ఎందుకంటే యూనిఫాంకి వాడే వస్త్రంలో కృత్రిమ రంగుల వాడకం ఎక్కువగా ఉండటంవల్ల చర్మంపైన దద్దుర్లు రావడం, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తడం, హార్మోన్లలో మార్పులు వంటి అనారోగ్య సమస్యలతో చిన్నారులు సతమతమవుతున్నారట. మనదేశం సహా మరికొన్ని దేశాలు ఎదుర్కొంటున్న ఈ సున్నితమైన సమస్యకు వియత్నాం ప్రభుత్వం మంచి పరిష్కారం తీసుకొచ్చింది. పిల్లల చర్మానికి ఏ ఇబ్బందీ కలిగించకుండా, తేలికగా... సౌకర్యవంతంగా ఉండేలా అరటినారతో స్కూల్ దుస్తుల్ని రూపొందిస్తోంది. వేడీ, ఉక్కపోతా ఎక్కువగా ఉండే వియత్నాంలో ఈ దుస్తులు చెమటని పీల్చుకుని పిల్లలని సౌకర్యంగా ఉంచుతున్నాయి. అలాగే వాడేసిన తర్వాత పాలిస్టర్‌లా కాకుండా వేగంగా భూమిలో కలిసిపోతూ పర్యావరణానికీ మేలు చేస్తున్నాయి. అరటిపంట చేతికొచ్చాక వృథాగా పడి ఉండే అరటిబోదెల నుంచి ఈ నారని సేకరించి, వాటితో దుస్తులని రూపొందిస్తోంది అక్కడి ప్రభుత్వం. దీంతో అటు వ్యవసాయ వ్యర్థాలకీ, ఇటు యూనిఫాం సమస్యలకీ కూడా పరిష్కారం దొరికిందన్నమాట.





వెలిగే కాంక్రీట్ వచ్చేసింది!




స్ట్రీట్ లైట్ల అవసరం లేకుండానే వీధులన్నీ ధగధగా వెలిగిపోతుంటే ఎలా ఉంటుంది? పగలు మామూలుగా ఉన్న మన ఇల్లు రాత్రిపూట ఫెయిరీటేల్ కథల్లోని భవనంలా జిగేల్‌మంటూ మెరిసిపోతుంటే భలే ఉంటుంది కదా! ఇవన్నీ ఎలా సాధ్యం అంటే... కృత్రిమ కాంతితో వచ్చే కాలుష్యాన్ని దూరం చేస్తూ, నిర్మాణాలని సహజమైన వెలుతురుతో మెరిపించే గ్లోయింగ్ కాంక్రీట్ లేదా ట్రాన్‌లూసెంట్ కాంక్రీట్ వచ్చేసింది మరి. ఆ విశేషాలేంటో తెలుసుకుందామా....



ఏ నగరాలని చూసినా ఆకాశాన్ని తాకే భవనాలూ... అందులో కళ్లు మిరుమిట్లు గొలిపే అద్భుతమైన ఇంటీరియర్ డిజైన్లూ సందడి చేస్తున్నాయి. చూస్తుండగానే భవన నిర్మాణాల్లో ఊహించని మార్పులు ఎన్నో వచ్చేశాయి. తేలికపాటి ఇటుకలూ, చెక్కా, కనువిందు చేసే అద్దాలూ, మెరిసే పెయింట్లూ... ఇలా ఒక్కటేంటి, ఎన్నో మార్పులు! ఇన్ని మారినా ఒక్కటి మాత్రం పెద్దగా మారలేదు...అదే కాంక్రీట్. చిన్నతనం నుంచీ మనం చూస్తున్న అదే సిమెంట్, ఇసుకా, కంకర మిక్స్. ఎప్పుడో శతాబ్దాల క్రితం రోమన్లు ఆవిష్కరించిన తర్వాత 18వ శతాబ్దంలో ఇంగ్లిష్ వాళ్లు చేసిన కొద్దిపాటి మార్పులు తప్ప, ఆ తర్వాత పెద్దగా ఏ మార్పూలేని కాంక్రీట్... ఇప్పుడు కొత్త హంగులు అద్దుకుంటోంది. ఈ మార్పు మన ఇళ్లని అందంగా మార్చడమే కాకుండా, మనకు కరెంట్ ఖర్చుని తగ్గించడంతోపాటు పర్యావరణానికీ మేలు చేస్తుందట... అదెలానో చూద్దాం.

కరెంట్ ఖర్చుని తగ్గించి...


ఒకదాని పక్కన ఒకటి ఇరుకిరుగ్గా, ఆకాశాన్ని తాకుతున్నట్టుగా ఉండే భవన సముదాయాల్లో మతిపోయే అనేక సదుపాయాలు ఉండేమాట నిజమే అయినా... వాటిల్లో సహజ వెలుతురూ, గాలీ ప్రసరించేది



చాలా తక్కువ. దాంతో లైట్లూ, ఏసీల వాడకం కోసం ఆ భవనాలు పూర్తిగా విద్యుత్‌పైన ఆధారపడాల్సిందే. అలా కాంక్రీట్ గోడలు విద్యుత్ వాడకాన్ని విపరీతంగా పెంచేస్తున్నాయి. మరోపక్క ఈ కృత్రిమ కాంతి కాలుష్యం వల్ల వచ్చే ఆరోగ్య చిక్కులూ ఎక్కువవుతున్నాయి. ఈ సమస్యలకు పరిష్కారం చూపిస్తూనే భవన నిర్మాణంలో కీలకంగా ఉండే కాంక్రీట్‌కి మరిన్ని ప్రయోజనాలని అద్దాలనుకున్నాడు హంగేరీ శాస్త్రవేత్త అరోన్. అలా అతని ఆలోచనల్లోంచి పుట్టిందే లిట్రాకాన్(లైట్ ట్రాన్స్మిటింగ్ కాంక్రీట్). అరె... కాంక్రీట్ ఎలా వెలుగుతుందీ అనేగా మీ సందేహం. ఇందుకోసం అతను సంప్రదాయ కాంక్రీట్‌నే వాడి... అందులో 4శాతం ఫైబర్ ఆప్టికల్స్‌ని చొప్పించాడు. ఫైబర్ ఆప్టికల్స్ అంటే- మన తల వెంట్రుకలంత సన్నగా ఉండే ప్లాస్టిక్ ట్యూబులు. ఇవి కాంతిని ఎటువైపు అయినా మళ్లించగలవు. వీటిని కాంక్రీట్ బ్లాక్స్‌లో వాడినప్పుడు వెలుతురు అటు నుంచి ఇటూ, ఇటు నుంచి అటూ తేలిగ్గా ప్రయాణిస్తుంది. ఈ కాంక్రీట్‌నే వాడుకలో 'ట్రాన్స్‌పరెంట్ కాంక్రీట్' అనీ, 'గ్లోయింగ్ కాంక్రీట్' అనీ పిలుస్తున్నారు. ఈ గోడలతో పగటిపూట కాంతిని సంపూర్ణంగా వినియోగించుకోవచ్చు. అలాగే, రాత్రుళ్లు మనం ఇంట్లో వాడే బల్బుల వెలుతురే బయటకు ప్రసరించి ఇల్లు అందంగా కనబడుతుంది. ఇదే కాంక్రీట్‌కి కొన్నిరకాల రెజిన్‌లనూ, పాతగాజునీ వాడి రాత్రిపూట దానంతటదే వెలిగే గ్లోయింగ్ కాంక్రీట్‌నీ శాస్త్రవేత్తలు తయారుచేశారు. ఈ కాంక్రీట్ పగటిపూట సూర్యరశ్మిని వాడుకుని రాత్రిపూట వెలుగుతుంది. అదికూడా ఒకటీ రెండు సంవత్సరాలు కాదు... ఏకంగా వందేళ్లు. అంతవరకూ వెనక్కి తిరిగి చూసుకోనక్కర్లేదు అంటున్నారు ఇంజినీర్లు. మరి ఈ కాంక్రీట్‌ని ఎక్కడెక్కడ ఉపయోగిస్తారంటే...

ఇంటి నిర్మాణంలో...


ఒకవైపు కాలుష్యాన్నీ, ఖర్చునీ తగ్గిస్తూనే... ఇంటికి అందాన్ని తెచ్చే ఈ తరహా కాంక్రీట్‌పట్ల ఇంజినీర్లూ, ఆర్కిటెక్ట్‌లూ బాగానే ఆసక్తి చూపిస్తున్నారు. మొత్తం ఇంటిని కాకపోయినా ఇంటికి అందాన్ని తెచ్చే ముందుభాగం- అంటే ఫసాడ్స్ కోసం వాడుతున్నారు. రెడీమేడ్‌గా తయారై వచ్చిన ప్రీ ఫ్యాబ్రికేటెడ్ ఫసాడ్స్ వివిధ రంగుల్లో లభ్యమవుతుండటంతో ప్రత్యేకించి పెయింట్లు వేయాల్సిన అవసరం కూడా ఉండటం లేదట. అలాగే ఈ కాంక్రీట్ బ్లాక్స్‌ని గోడల్లో, మెట్ల దిగువ భాగానికీ, సీలింగ్, ఫ్లోరింగ్‌కోసం, ఇంట్లో పార్టీషన్లుగా, డెకరేషన్ ప్యానెల్స్‌గా, ఆర్ట్ గ్యాలరీల్లోనూ ఉపయోగిస్తున్నారు. రాత్రిపూటా కనిపించేలా వాకింగ్ ట్రాక్స్‌కీ, సైకిల్ ట్రాక్స్‌కీ, స్పీడ్ బ్రేకర్లూ సబ్‌వేల దగ్గర ఈ గ్లోయింగ్ సిమెంట్‌ని వాడి నిర్మాణాలు చేస్తున్నారు. జర్మనీ, అమెరికా, చైనావంటి దేశాలు ఈ టెక్నాలజీని రహదారి భద్రతలో వాడుతుంటే, మన దేశంలో ఆర్కా టెక్నాలజీ, చెన్నైలోని సత్యభామా యూనివర్సిటీ, ముంబయి యూనివర్సిటీలు ఈ కాంక్రీట్‌పైన పరిశోధనలు చేస్తున్నాయి. అమెజాన్‌వంటి సైట్లలో చదరపు అడుగు రూ.1200 నుంచి మొదలుపెట్టి వీటిని విక్రయిస్తున్నారు. కరెంట్ అక్కర్లేని ఈ కాంక్రీట్ ముచ్చట భలే ఉంది కదూ! ★




కల్పేశ్వర్

శివయ్య శకలాలు... పంచకేదారాలు!

పరమాణువు నుంచి బ్రహ్మాండం వరకూ విశ్వమంతా వ్యాపించిన లయకారుడు జ్యోతి స్వరూపుడిగా, పంచభూతాలకు ప్రతిరూపంగా కొలువు దీరిన ద్వాదశ జ్యోతిర్లింగాలూ, పంచభూత స్థలాలూ ఒక ఎత్తు... ఆ శివయ్య అయిదు కేదార క్షేత్రాల్లో అవతరించిన తీరు మరొక ఎత్తు. మంచుకొండల మధ్య అయిదు పవిత్ర ప్రదేశాల్లో నీలకంఠుడి శరీరభాగాలు పడిన ప్రాంతాలే పంచకేదారాలు. కైలాసాన్ని తలపించే ఈ అయిదు శైవక్షేత్రాల దర్శనం శుభకరం. సర్వపాపహరణం. (ఈ బుధవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా... ఆ దివ్య క్షేత్రాల సమాచారం)


కేదార్‌నాథ్






ఆకాశాన్ని తాకే మంచు పర్వతాలతో, పచ్చని ప్రకృతి అందాలతో అలరారే దేవభూమి ఉత్తరాఖండ్. దేవతలు నడయాడిన నేలగా పిలిచే ఈ పుణ్యస్థలిలో శ్రీమన్నారాయణుడు బద్రినాథుడిగా అవతరిస్తే... కైలాసవాసుడు ఏకంగా అయిదు చోట్ల కొలువుదీరి భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ఆ ఆలయాలకు పంచకేదారాలని పేరు. దేశవ్యాప్తంగా ఎన్ని శివాలయాలు ఉన్నా... ఇవి మాత్రమే అంతటి విశిష్టతను సంతరించుకోవడానికి కారణం... ఇక్కడ మహాదేవుడి శరీరభాగాలు పడటమేనంటారు. పాండవులు నిర్మించిన ఈ మహాక్షేత్రాల్ని దర్శించుకుంటే, కైలాసంలో కొలువైన పరమేశ్వరుడిని పూజించిన ఫలితం దక్కుతుందని ప్రతీతి. అవే... ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్, రుద్రనాథ్, కల్పేశ్వర్, మధ్యమహేశ్వర్, తుంగనాథ్. ఈ పంచకేదార క్షేత్రాల వెనుక ఆసక్తికరమైన కథనాలు ఉన్నాయి.

స్థలపురాణం

పాండవులు కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవులను అంతమొందించారు. ఆ శత్రు సైన్యంలో బ్రాహ్మణ యోధులూ ఉన్నారు. దీంతో యుద్ధంలో గెలిచినా... బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. ప్రాయశ్చిత్తం కోసం పరమేశ్వరుడిని ప్రార్థించేందుకు వారణాసికి వెళ్లారు. అయితే, విశ్వనాథుడు వాళ్లను అనుగ్రహించలేదు. పాండవుల నుంచి తప్పించుకునే క్రమంలో నంది (ఎద్దు) రూపాన్ని ధరించి ఈ ప్రాంతానికి చేరుకున్నాడట. ఓ చోట ఎడ్లు మేత మేస్తుంటే, వాటి మధ్యలోకి వెళ్లి దాక్కున్నాడట. భీముడు అది చూసి... శివుడిని గుర్తించి, ఎద్దు తోకనూ, కాళ్లనూ పట్టుకునేందుకు శక్తికొద్దీ ప్రయత్నించాడట. అప్పుడు శివుడు భూమిలోకి అదృశ్యమయ్యే క్రమంలో... ఆ దేవదేవుడి శరీరభాగాలు అయిదు ప్రాంతాల్లో పడ్డాయట. అలా... కేదార్‌నాథ్‌లో - వీపుభాగం, తుంగనాథ్‌లో - చేతులు, రుద్రనాథ్‌లో - ముఖం, మధ్యమహేశ్వర్‌లో- నాభి, కల్పేశ్వర్‌లో- జటాజూటం పడ్డాయని అంటారు. ఆ అయిదు వేర్వేరు భాగాలను దర్శించుకున్న పాండవులు... ఆ తర్వాత అక్కడ ఆలయాలను నిర్మించి, మోక్షాన్ని పొందారనేది కథ. అలా, భక్తులకు అందుబాటులోకి వచ్చాయి పంచకేదార క్షేత్రాలు. దాదాపుగా ఒకేలా కనిపించే ఈ ఆలయాలు విశిష్టతలో మాత్రం దేనికదే ప్రత్యేకం.


రుద్రనాథ్



కేదార్‌నాథ్

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన కేదార్‌నాథ్ పంచ కేదారాల్లో మొదటిది. చార్‌ధామ్ యాత్రలోనూ భాగమైన ఈ ఆలయం సముద్ర మట్టానికి దాదాపు 3600 మీటర్ల ఎత్తులో, గంగానదికి ఉపనది అయిన మందాకిని ఒడ్డున కనిపిస్తుంది. ఇక్కడి వాతావరణ పరిస్థితుల కారణంగా ఆలయ ద్వారాలను అక్షయ తృతీయ నాడు తెరిచినా, చలి పెరిగేకొద్దీ మూసేస్తారు. సాధారణ శివాలయాలతో పోలిస్తే... ఇక్కడి శివలింగం త్రిభుజాకారంలో కనిపిస్తుంది. వాతావరణ పరిస్థితుల్ని తట్టుకునేలా ఆలయాన్ని రాతి పలకలతో నిర్మించారు. ఆదిశంకరాచార్యులు ఈ పరిసరాల్లోనే మహాసమాధి పొందారని ప్రతీతి. అందుకు గుర్తుగా శంకరుల సమాధిగా భావించే నిర్మాణాన్నీ ఆలయం వెనకాల చూడొచ్చు. గుడిని మూసేస్తున్నప్పుడు కేదార్‌బాబాగా పిలిచే స్వామి విగ్రహాన్ని స్థానిక ఉకీమఠ్‌లోని ఓంకారేశ్వర్ ఆలయానికి తరలిస్తారు. అక్కడే ఆరు నెలలపాటు పూజలు అందుకుంటాడు మహాదేవుడు. ఆ సమయంలో ప్రధాన పూజారి కూడా ఉకీమఠ్‌కు వెళ్లిపోతాడు. స్వామి దర్శనం తర్వాత... వేడినీళ్లు వచ్చే గౌరీకుండ్, ఆకుపచ్చ కొలనుగా కనిపించే వాసుకితల్‌నూ చూడొచ్చు.

తుంగనాథ్

తుంగనాథ్...ప్రపంచంలోని ఎత్తయిన శివాలయాల్లో ఒకటి. తుంగనాథ్ అంటే పర్వతాల ప్రభువు అని అర్థం. రుద్ర ప్రయాగ్ జిల్లాలో చంద్రశిలా శిఖరానికి దిగువన దాదాపు 3,700 మీటర్ల ఎత్తులో ఉంటుందీ క్షేత్రం. పరమేశ్వరుడి బాహువులు పడిన ఈ ప్రదేశంలో శ్రీరామచంద్రుడు తపస్సు చేశాడని పురాణాలు చెబుతున్నాయి. ఆలయంతోపాటు గర్భ గృహంలో ఉన్న శివలింగం కూడా పక్కకు వంగినట్లుగా ఏటవాలుగా కనిపిస్తుంది. విచిత్రం ఏంటంటే... ఇక్కడి ఉపాలయాలూ కాస్త పక్కకు వంగినట్లుగా ఉంటాయి. అందుకు కారణం ఏమిటన్నది ఇప్పటివరకూ ఎవరూ కనుగొనలేకపోయారు.

రుద్రనాథ్

పంచకేదార క్షేత్రాల్లో మూడోది రుద్రనాథ్. చమోలీ జిల్లాలోని ఈ ఆలయంలో స్వామి ముఖాన్ని దర్శించుకోవచ్చు. సముద్ర మట్టానికి 2290 మీటర్ల ఎత్తులో ఉండే రుద్రనాథ్‌కీ, నేపాల్ ఖాట్మండులోని పశుపతి నాథ్‌కీ సంబంధం ఉందని అంటారు. అక్కడా శివలింగానికి బదులుగా స్వామి ముఖాన్నే పూజిస్తారు. ఇక, రుద్రనాథ్‌లో స్వామి ముఖం ఉగ్రరూపంలో కనిపించినా... స్వతహాగా ప్రసన్నవదనుడనే చెబుతారు అర్చకులు. అందుకే, అప్పుడప్పుడూ శాంతమూర్తిగా విలసిల్లే సహజరూపాన్నీ భక్తులకు చూపిస్తారు. ఆలయానికి సమీపంలో ఉన్న పాండవసెరలో పాండవులు వ్యవసాయం చేశారని అంటారు. ఆరునెలలు మాత్రమే దర్శనభాగ్యం కలిగించే ఈ ఆలయాన్ని నవంబరు నెలలో మూసేస్తారు. ఆ సమయంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గోపేశ్వర్ ప్రాంతంలోని గోపీనాథ్ ఆలయానికి తరలిస్తారు.




మధ్యమహేశ్వర్

మధ్యమహేశ్వర్

ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్‌లో సముద్ర మట్టానికి దాదాపు 3,500 మీటర్ల ఎత్తులో ఉంటుంది... మధ్యమహేశ్వర్. ఈ ఆలయాన్ని చేరుకోవాలంటే రాన్సీ అనే గ్రామం మీదుగా పదహారు కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేస్తూ వెళ్లాలి. చుట్టూ అడవులూ, పచ్చికబయళ్ల మధ్య కనిపించే మధ్యమహేశ్వర్‌లో పరమేశ్వరుడి నాభి భాగం పడిందని అంటారు. అందుకు గుర్తుగా నాభిని పోలిన శివలింగం ఇక్కడ దర్శనమిస్తుంది. ఆలయం చుట్టూ ఉన్న చౌఖంబా, నీలకంఠ, కేదార్‌నాథ్ మంచుపర్వతాలను చూసేందుకు రెండు కళ్లూ చాలవు. ఈ ఆలయాన్ని పాండవ మధ్యముడైన భీమసేనుడు నిర్మించినట్లు చెబుతారు. మంచు తీవ్రతను బట్టి నవంబర్ మాసంలో ఇక్కడున్న విగ్రహాన్ని ఉకీమఠ్‌కు తరలిస్తారు. ఇక్కడి నుంచి రెండుకిలోమీటర్ల దూరంలో ఉన్న బుడా మద్‌మహేశ్వర్ ఆలయాన్ని సందర్శించడమూ పంచకేదార క్షేత్ర దర్శనంలో భాగమే.

కల్పేశ్వర్

పంచకేదార క్షేత్రాల్లో చివరిది... కల్పేశ్వర్. ఇక్కడ స్వామి జటాజూటం- అంటే, కేశాలు పడ్డాయన్నది ఐతిహ్యం. అందుకే ఈ స్వామిని జటేశ్వర్ అనీ, జటాధర్ అనీ పిలుస్తారు. మిగిలిన నాలుగింటిలా కాకుండా, చమోలీ జిల్లాలో ఉన్న ఈ ఆలయాన్ని ఏడాది మొత్తం తెరిచే ఉంచుతారు. చిన్న గుహలా కనిపించే ఈ ఆలయం సముద్ర మట్టానికి 2200 మీటర్ల ఎత్తున ఉంటుంది. ఒకప్పుడు ఈ ప్రాంతంలోనే కల్పవృక్షం ఉండేదనీ, దాని దగ్గరే దూర్వాస మహర్షి తపస్సు చేశాడనీ స్థల పురాణం చెబుతోంది.

ఎలా చూడొచ్చు...

పంచకేదార ఆలయాలను దర్శించుకోవాలనుకునే భక్తులకోసం ప్రత్యేకంగా ప్యాకేజీలు అందుబాటులో ఉన్నా... వీటిని ఓ క్రమపద్ధతిలో చూడాల్సి ఉంటుంది. మొదట బేస్‌క్యాంప్ అయిన రిషికేశ్ లేదా హరిద్వార్ నుంచి మొదలుపెట్టాలి. ఆ తర్వాత గౌరీకుండ్ మీదుగా కేదార్‌నాథ్‌కు వెళ్లాలి. అదయ్యాక మధ్యమహేశ్వర్ ఆలయానికి రాన్సీ మీదుగా ట్రెక్కింగ్ చేస్తూ చేరుకోవాలి. తర్వాత తుంగనాథ్‌కీ వెళ్లొచ్చు. అయితే... రుద్రనాథ్ యాత్ర మాత్రం కాస్తంత సాహసోపేతమే. చివరిదైన కల్పేశ్వర్‌కు వెళ్లేందుకు ఉగ్రమ్ లోయమీదుగా ట్రెక్కింగ్ చేయాలి. ఇవన్నీ పూర్తయ్యాక బద్రినాథుడి దర్శనంతో పంచకేదారాల యాత్ర పూర్తవుతుంది. మహాదేవుడిని మదిలో నింపుకుని... భక్తులు తిరుగుప్రయాణం అవుతారు. ★


తుంగనాథ్



కథ

మాటే మంత్రము

– హరితాదిత్య

ఏందుకో ముభావంగా ఉంది ఇందిర. పోయిన వారమే వచ్చింది కొడుకు ఆకాష్ ఇంటి నుంచి. ఆకాష్‌కి పెళ్ళి చేసి ఆరు నెలలు అయింది. వేరు కాపురం ఉంటున్నారు ఆకాష్ దంపతులు- ఆఫీసు దగ్గరలో ఇల్లు తీసుకుని. వారాంతాల్లో వచ్చి వెళ్తుంటారు. ఒక వారం తను కొడుకు ఇంట్లో ఉండి, వాళ్ళ కొత్త కాపురం చూసి మురిసిపోవాలని సంబర పడుతూ వెళ్ళింది. కానీ వెళ్ళే ముందు ఉన్న ఉత్సాహం వచ్చాక లేదు. ‘ఏమైంది?’ అంటే, ‘ఏం లేదు’ అంటుందే తప్ప, అసలు విషయం చెప్పట్లేదని భర్త రామారావు ఆదుర్దా పడుతున్నాడు. అప్పటికీ కొడుకుకి ఫోన్ చేసి అడిగాడు- ‘ఏమైనా జరిగిందా, అమ్మ అక్కడ ఎలా ఉందీ’ అని. ‘బాగానే ఉంది, ఏం జరగలేదు’ అంటూ పొడిపొడిగా మాట్లాడి పనుందంటూ ఫోన్ పెట్టేశాడు. కోడలు మేఘనే ‘ఏదో అని ఉంటుంది’ అని అనుమానంగా ఉంది అతనికి. ఒకట్రెండు సార్లు కొడుకు- కోడలిని ‘పొగరుబోతు’ అనడం విన్నాడు కూడా. అదే ఆలోచిస్తున్న అతను డోర్ బెల్ శబ్దం అవడంతో, ఆ ఆలోచనల నుంచి బైటికి వచ్చి తలుపు తీశాడు. ఎదురుగా ఆకాష్. ‘వీకెండ్ కూడా కాదు, మరి ఎందుకొచ్చినట్టు’ అనుకుని, ‘అమ్మ డల్‌గా ఉంది అనడంతో వచ్చేసి ఉంటాడు. పిచ్చి సన్నాసి... అమ్మ అంటే ప్రాణం వాడికి’ అని సంతోషపడుతూ ఇందిరని పిలిచాడు.

ఆకాష్‌ని చూస్తూనే ఇందిర ‘‘మేఘన ఏది?’’ అని అడిగింది.

‘‘రాలేదు, వాళ్ళ అమ్మ దగ్గరికి వెళ్ళింది’’ అన్నాడు ముక్తసరిగా.

ఆకాష్ కూడా వచ్చినప్పటి నుంచీ ముభావంగా ఉన్నాడు. ఏం మాట్లాడాలన్నా ఏదో పరధ్యానంగా, అసహనంగా ఉన్నాడు. ఏదో జరిగింది అని అర్థం చేసుకున్న రామారావు ఆకాష్ చెప్పే వరకూ ఆగాలని, అడగకుండా ఎదురు చూస్తున్నాడు.

సాయంత్రం అవడంతో కాఫీలు తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది ఇందిర. కప్పు పట్టుకుని తాగకుండా ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్న ఆకాష్‌ని ‘‘తాగు నాన్నా, మధ్యాహ్నం భోజనం కూడా సరిగా చేయలేదు. ఇప్పుడూ ఏదో ఆలోచిస్తున్నావు. మాతో ఏమైనా చెప్పాలా?’’ అడిగాడు రామారావు ఇక ఉండబట్టలేక.


‘‘నాన్నగారూ, నేనూ మేఘనా విడిపోవా లనుకుంటున్నాం’’ బాంబు పేల్చాడు ఆకాష్.

ఉలిక్కిపడ్డ రామారావు షాక్‌లో ఉండిపోయాడు. భార్య విషయంలో కూడా కోడలినే దోషిగా భావిస్తున్న ఆయన తేరుకుని ‘‘నీకు నచ్చినట్టు చెయ్యి, ముందు కాఫీ తాగు’’ అనేసి వెళ్ళిపోయాడు మౌనంగా.

ఇవన్నీ వింటూ కూడా ఏమీ పట్టించు కోకుండా చాలా మామూలుగా కాఫీ కప్పులు తిరిగి తీసుకెళ్తున్న ఇందిరని చూసి ఆశ్చర్యపోయారు ఇద్దరూ.

ఈ సంభాషణ జరిగిన కాసేపటికి మొక్కలకి నీళ్ళు పోయడానికి డాబా మీదకి వెళ్ళింది ఇందిర- తన రోజువారీ పనుల్లో భాగంగా. ఆకాష్ కూడా వెనకే వెళ్ళి తల్లి చెయ్యి పట్టుకుని, అక్కడే వారు కూర్చుని మాట్లాడుకునేందుకు కట్టించుకున్న సిమెంటు అరుగు మీదకి తీసుకువచ్చి కూర్చోబెట్టాడు.

‘‘ఏమ్మా, నేను చూస్తూనే ఉన్నా, నాతో అసలు మాట్లాడడం లేదు, ఇంకా ఆ సంఘటనే తల్చుకుంటున్నావా?’’ అని అడిగాడు.



మోటర్ వేసి ‘నీళ్ళు నిండాయా ట్యాంక్‌లో’ అని చూడటానికి వచ్చిన రామారావు వీరి మాటలు విని అక్కడే ఆగిపోయాడు. అటువైపు తిరిగి కూర్చున్న ఆకాష్, ఇందిరలు రామారావు రాకని గుర్తించలేదు.

‘‘చెప్పమ్మా’’ మళ్ళీ అడిగాడు ఆకాష్, బతిమాలు తున్నట్టుగా. ఆమె ఆకాష్ చేతుల్లోంచి తన చేయి విడిపించుకుంది.

తీక్షణంగా ఆకాష్‌నే చూస్తూ ‘‘మేఘన మీద చేయి చేసుకుని, నువ్వు నీ వ్యక్తిత్వాన్నే కాదు, మా పెంపకాన్ని కూడా పాతాళంలోకి నెట్టావు’’ అంది.

‘ఏదో జరిగింది, కొడుకు కోడలిపై చేయి చేసుకునేంత దూరం వెళ్ళింది. ఇందిర చెప్పనే లేదు. బహుశా తనకి కోపం వస్తుందని ఆగిందా లేక బాధపడతాననుకుందా..? తెలియడం లేదే’ అని రకరకాలుగా ఆలోచిస్తున్నాడు. దగ్గరికి వెళ్ళి అడిగేకంటే పూర్తి విషయం తెలుసుకుందామని అక్కడే ఆగి వింటున్నాడు రామారావు.

‘‘నువ్వే చూశావుగా తను ఎన్నేసి మాటలన్నదో, చాలా పొగరు’’ అన్నాడు ఆకాష్ కోపంగా.

‘‘నాకేం అలా అన్పించలేదు. నువ్వు అన్నదానికి తను సమాధానం చెప్పింది. అది నువ్వు ఒప్పుకోలేకపోయావు’’ దృఢంగా అంది ఇందిర.

ఇన్ని రోజులూ కోడలిదే తప్పు అనుకుంటున్న రామారావు ఇది విని ఆశ్చర్యపోయాడు.

‘‘సరే, ఇంతకీ విడాకులు ఎందుకు? నిర్ణయం తీసుకునే ముందు మీ పెళ్ళి జరిపించిన మేం గుర్తురాలేదా?’’ సూటిగా అడిగింది ఇందిర.

‘‘దెబ్బ మాది అంటే, నొప్పి కూడా మాకే కదా’’ అన్నాడు ఆకాష్, ఏదో సినిమాలో పంచ్ డైలాగ్‌లాగా.

‘‘నిజమే, కానీ మేం ఆ దెబ్బలకి మందో, మంత్రమో వేయగలమా లేదా అనేది కూడా చూడాలిగా’’ అంది అదే స్టయిల్‌లో.

‘‘అమ్మా, ఎప్పుడూ గొడవలే... తన ఏడుపులే. ఇలా కలిసి బతికేకంటే విడిపోవడం బెటర్. అయినా ఈ రోజుల్లో విడాకులు అనేది కామన్. ఇష్టం లేకపోతే విడిపోవచ్చు’’ అన్నాడు తేలికగా.

‘‘ఒప్పుకుంటా, కానీ అవి ‘ఎలాంటి గొడవలు... పరిష్కారం ఉన్నవా లేనివా?’ అని కూడా ఆలోచించాలి కదా’’ అంది.

‘‘నువ్వు చూడలేదా అమ్మా, అన్నింటికీ వాదిస్తుంది. ఒక్క పని కూడా రాదు. నువ్వు ఉన్నప్పుడు కూడా మొత్తం నీతోనే చేయించింది తెలివిగా. ఏదైనా తిడితే చాలు పొడుచుకొచ్చే స్తుంది. మాట పడదు. అసలు తనని కాదు, అలా పెంచిన వాళ్ళ అమ్మా బాబుని అనాలి’’ ఆవేశంగా చెప్తున్నాడు ఆకాష్.

‘‘నేను ఫ్రెండ్స్ ఇంటికి వెళ్తే తను కజిన్స్ ఇంటికి వెళ్ళిపోతుంది. ‘నాతోనే రావాలి కదా’ అని అడిగితే, ‘నువ్వే నాతో రా’ అంటుంది... ఎంత పొగరో. నీకు గుర్తుంది కదా... ఆ రోజు ఏం జరిగిందో, ఎంత ధైర్యం, అహంకారం, నన్నే అంటుందా...’’ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు ఆకాష్.

"ఏమన్నది అంత తప్పుగా... 'ఇలా పెంచారేంటత్తయ్యా' అంది. నీ ప్రవర్తన చూశాక- ఆ మాట నాకేం తప్పుగా అన్పించ లేదు. ఎప్పుడూ తనే నీ ఫ్రెండ్స్ ఇళ్ళకూ బంధువుల ఇళ్ళకూ రావాలనే పంతం ఎందుకు? కొన్నిసార్లు నువ్వూ తనతో వెళ్ళొచ్చు కదా. ఇక పనులంటావా... ఈ చదువులూ ఉద్యోగాల్లో ఇంటి పనులు నేర్చుకునేంత తీరిక దొరకడం లేదు కదా, నేర్చుకుంటుంది నెమ్మదిగా" అంది.

ఎప్పుడూ తనని సమర్థించే అమ్మ, ఈసారి ఇలా కోడలిని వెనకేసుకొస్తుండటం ఆకాష్‌ని ఆశ్చర్యపరిచింది. కాసేపు మౌనంగా కాలం గడిచింది. ఇందిర కళ్ళ ముందు- తను ఇంటికి బయలుదేరే రోజు ఉదయం కొడుకు ఇంట్లో జరిగిన సంఘటన కదలాడింది.

★ ★ ★

మేఘన లేచేసరికే టిఫిన్, లంచ్ రెడీ చేసింది ఇందిర. అలా అత్తాకోడళ్ళు ఇద్దరూ కలిసి కాఫీ తాగడం చేస్తున్నారు నాలుగు రోజులుగా. కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళ దగ్గరికి వచ్చాడు ఆకాష్ తన కాఫీ కప్పుతో.

'ఏంటమ్మా, నువ్వు వెళ్ళిపోతే అన్ని పనులూ మళ్ళీ తనే చేసుకోవాలని ఏడుస్తోందా నీ కోడలు' అన్నాడు వ్యంగ్యంగా.

మేఘన ఆ మాటలకు నొచ్చుకుంది అని అర్థమైన ఇందిర 'ఏరా, మీ అక్క ఇంటికి వెళ్తే కూడా ఇలాగే చేస్తాగా. ఏదో కొత్తగా చేస్తున్నట్లు మాట్లాడుతున్నావేం' అంది సిట్యుయేషన్‌ను తేలిక పరచాలని.

'అక్కతో పోలికేంటి? తనూ జాబ్ చేస్తుంది, ఇంకా, పిల్లలతోపాటు వాళ్ళ అత్తా మామల్ని కూడా చూసుకుంటుంది. ఈవిడకి మేం ఇద్దరమే అయినా ఒళ్ళు వంగదు' అన్నాడు నవ్వుతూ.

అది ఎంత మాత్రమూ హాస్యాస్పదమైన విషయం కాకపోయినా అలా నవ్వడం మేఘన, ఇందిరలకి నచ్చలేదు. 'ఇలాగే ప్రతి దానికీ దెప్పుతుంటాడు, వదినతో పోల్చుతుంటాడు అత్తయ్యా' అంది మేఘన నొచ్చుకున్న గొంతుతో.

అవమానంగా అనిపించిందో బాధపడ్డదో అక్కడ నుంచి వెళ్ళిపోయింది. ఆకాష్ కూడా వెనకే వెళ్ళాడు. గదిలో ఇద్దరి వాదులాట బైటదాకా వినిపిస్తూనే ఉంది. 'నేనేమన్నానని అమ్మ ముందు సీన్ చేస్తున్నావ్?' అన్నాడు ఆకాష్.

'ఏంటి ఆకాష్, నీ ప్రాబ్లమ్. జాబ్ చేస్తూ కూడా ఇంట్లో పని చేస్తూనే ఉన్నాగా, కొంచెం కూడా హెల్ప్ చేయకుండా వంకలు పెడతావేంటి?' తన బాధను వివరించే ప్రయత్నం చేస్తోంది మేఘన.

'నేను హెల్ప్ చేసే పనులు ఏమున్నాయి. ఆడపిల్ల అన్నాక వంటపనీ ఇంటిపనీ చేయాలిగా. అందరూ చేసేదే. మరీ సుకుమారంగా పెంచారు మీవాళ్ళు' అంటూ టాపిక్ వాళ్ళ అమ్మానాన్న వైపు తిప్పాడు. మాటా మాటా పెరిగింది.

'జాగ్రత్తగా మాట్లాడు ఆకాష్. నువ్వు మా అమ్మా వాళ్ళని అంటే, నేనూ మీ వాళ్ళని అనాల్సి ఉంటుంది' అంది కోపంగా. ఆ మాటలు నచ్చని ఆకాష్, ఆవేశంతో మేఘన చెంప ఛెళ్ళు మనిపించాడు. కళ్ళనీళ్ళతో బైటికి వచ్చిన మేఘన ఇందిరని చూస్తూ 'ఇలా పెంచారేంటత్తయ్యా' అంటూ ఆఫీస్ బ్యాగ్ తీసుకుని వెళ్ళిపోయింది. ఆ క్షణం నుంచీ ఇందిర మౌనంగా ఉండిపోయింది.

★ ★ ★

"నా మీద నీకు కోపం వచ్చిందని అర్థమైంది అమ్మా, కానీ నేను కావాలని కొట్టలేదు, తనే రెచ్చగొట్టింది" అన్నాడు ఆకాష్ తనని తాను సమర్థించుకుంటూ.

ఆ మాటకి మళ్ళీ ప్రస్తుతంలోకి వచ్చిన ఇందిర "అవునా! ఎన్నోసార్లు నేను కూడా నిన్ను తిట్టాను. మరి నన్ను కొట్టలేదే? ఓహో అమ్మని కదా అని సంస్కారం



అడ్డువచ్చిందేమో... సంతోషం. మరి ఆఫీసులో మీ బాస్ బాగా విసిగిస్తున్నాడని- ఆఖరికి రిజైన్ చేద్దాం అని కూడా అనుకున్నావు కదా, మరి అంతలా విసిగించిన మీ బాస్‌ని కొట్టలేదే? జాబ్ కోసం అని సహనంతో భరించావు. నీ భార్య మీద చేయి చేసుకునే ముందు ఆ సంస్కారం, సహనం ఏమైపోయాయి? 'భార్యేగా, భరించాలి' అని గ్రాంటెడ్‌గా తీసుకున్నావా? తను తిరిగి కొడితే? ఇక అలా ఒకరిని ఒకరు కొట్టు కుంటూ, తిట్టుకుంటూపోతే ఈ చదువులూ పెద్ద ఉద్యోగాలూ ఎందుకు? సంస్కారం లేని చదువు దండగ" అంది కఠినంగా. తలదించుకున్నాడు ఆకాష్.

★ ★ ★

మొదటి నుంచీ ఇంటి బాధ్యతతోపాటు, పిల్లల పెంపకం బాధ్యత కూడా ఇందిరకే ఇచ్చాడు రామారావు. అన్నీ సమర్థంగా చేసే భార్య అంటే నమ్మకం. ఉద్యోగం, పిల్లలు, తన తల్లిదండ్రులు ఇలా... అన్నిటినీ అందరినీ చూసుకునే ఇందిర అంటే- రామారావుకి ఒక ధైర్యం. అన్నివేళలా అన్నీ సమకూరుస్తూ, అందుబాటులో ఉండే అమ్మకి పిల్లలు దగ్గరవడం సహజం. అలాగే ఇందిరకు కొడుకు ఆకాష్, కూతురు నిత్యలే స్నేహితులు. అన్నీ తనతో పంచుకోవడంతోపాటు, ఏ సమస్య వచ్చినా తన సలహాలు తీసుకుంటారు. రెండేళ్ళక్రితం కూతురు నిత్య కూడా ఇలాగే మెట్టినింట సమస్య అని ఇంటికి వస్తే, చాలా రకాలుగా మంచి మాటలు చెప్పి పంపింది ఇందిర. ఏం మంత్రం వేసిందో కానీ నిత్య కాపురం బాగానే సర్దుకుంది. ఒకసారి పండగకి వచ్చిన వియ్యాలవారూ అల్లుడూ నిత్యని మెచ్చుకుంటూ ఉంటే గర్వపడ్డాడు రామారావు. కాబట్టి కొడుక్కి కూడా ఏదో మంచి మాటలే చెప్పి కాపురం దిద్దుతుంది అని వారిని డిస్టర్బ్ చేయకుండా, అక్కడే నిలబడి 'ఏం చెప్తుందా' అని వింటున్నాడు.

★ ★ ★

"పెళ్ళి అయినప్పుడే నీకు కొన్ని విషయాలు చెప్పాలి అనుకున్నాను. తెలివైనవాడివీ బాగా చదువుకున్నవాడివీ ఈ కాలం కుర్రాడివి కదా... అవసరం లేదేమో అనుకున్నా. అదే నేను చేసిన తప్పు" అంది.

"ఆడపిల్లలకి చెబుతారు కానీ నాకు చెప్పేదేంటమ్మా" విసుగ్గా అన్నాడు ఆకాష్.

"నిజమే, ఆడపిల్లలు వేరే ఇంటికి వెళ్తారు కాబట్టి వాళ్ళకి చెప్పేవారు. కానీ ఇప్పుడు ఉద్యోగాలనీ ప్రైవసీ అనీ మగపిల్లలు కూడా పెళ్ళయ్యాక దూరం వెళ్తున్నారు. తప్పొప్పులు చెప్పే పెద్దవారు పక్కన ఉండటం లేదు. మనల్ని నమ్మి పెళ్ళి చేసి పంపిన ఆడపిల్ల తల్లిదండ్రులకు సమాధానం చెప్పాలి కాబట్టి, నన్ను అడిగితే మగపిల్లలకి జాగ్రత్తలు చెప్పడమే కరెక్ట్ అంటాను" అంది ఇందిర.

అయోమయంగా చూస్తున్న ఆకాష్ తల నిమురుతూ "నిన్ను ఒక విషయం అడగనా" అంది. 'అడుగు' అన్నట్టు తలూపాడు. "పెళ్ళికి ముందు- 'ప్రిపేర్డ్‌గా ఉన్నావా పెళ్ళి చేసుకోవడానికి' అని అడిగాను. 'అవును' అన్నావు. ఏం ప్రిపేర్ అయ్యావు?" అని అడిగింది.

"మంచి జీతం, ఆరోగ్యంగా ఉన్నాను, ఇల్లు కొన్నాను, వయసు కూడా పాతిక దాటింది. ఇంకేం కావాలి?" అన్నాడు ఒకింత గర్వంగా.

"ఉన్నాయి- రెండు ముఖ్యమైనవి- గౌరవం, స్వేచ్ఛ."

అర్థంకానట్టు చూస్తున్న ఆకాష్‌తో మళ్ళీ చెప్పింది "భార్య ఇష్టాయిష్టాలను గౌరవించడం, తన జీవితం తన చేతుల్లోనే ఉంది అన్పించేంత స్వేచ్ఛగా బతకనివ్వడం."

ఆ మాటలు నచ్చనట్టు మొహం పెట్టాడు ఆకాష్. అది గమనించిన ఇందిర "నీకు వివరంగా చెప్తాను, ఓపిగ్గా వింటావా?" అని అడిగింది.

"ఊఁ" అన్నాడు ఆకాష్.

"మా అమ్మమ్మవాళ్ళ తరంలో తాతయ్య పొలం పనులూ బైట పనులూ చేస్తూ ఉంటే, అమ్మమ్మ పదిమంది పిల్లల ఆలనా పాలనా

ఇల్లూ గొడ్లూ అన్నీ చూసుకునేది. ఆర్థికంగా ఎలా ఉన్నా ఎవరి బాధ్యతలు వారివి. ఒకరిని ఒకరు అర్థం చేసుకుని గుట్టుగా అన్యోన్యంగా కాపురం చేసుకునేవారు. తరువాత తరం- అంటే, మా అమ్మ తరానికి వచ్చేసరికి గవర్నమెంటు ఉద్యోగాలు వచ్చే రోజులవి. మగవారు ఉద్యోగాలకి వెళ్తే ఇంట్లో అయిదుగురు ఆరుగురు పిల్లలతో, వచ్చేపోయే బంధువుల పెట్టుపోతలతో సంసారాలు లాక్కొచ్చారు అప్పటి ఆడవారు. అయినా భర్తే ఆ ఇంటికి యజమాని. భార్య అన్ని సపర్యలూ చేసేది, చేయాలి కూడా. ఇక మాదాకా వచ్చేసరికి ఇంట్లో ఉండే ఆడవారు కొందరైతే, వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు అన్నట్టు ఉద్యోగాలు చేసేవారు మరికొందరు. ఉద్యోగం చేస్తున్నా సరే, ఇంటిపనుల్లో మగవారి సహాయం తీసుకునేవారు కాదు. ఒకవేళ అడిగినా అత్తగారూ మామగారూ ఇరుగు పొరుగుతో సహా తప్పు పడతారు. తరాలు మారే కొద్దీ ఎక్కడో, ఆడవారికి- ముఖ్యంగా భార్యలకి- గౌరవం ఇవ్వడం తగ్గింది. ఆఫీసుల్లో చికాకులూ ఆర్థిక ఇబ్బందులూ... ఇలా ఏం ఉన్నా విసుగు చూపించేది భార్య మీదే. అన్నీ చేస్తూ మాటలు కూడా భరించి, ఆ భర్తని అనుసరిస్తేనే ఆ స్త్రీ 'ఉత్తమ ఇల్లాలు' అనిపించుకుంటుంది. నా విషయమే తీసుకుంటే- టీచరు ఉద్యోగం చేస్తూ ఇద్దరు పిల్లల్నీ, మీ నాన్నమ్మ తాతయ్యలతోపాటు మీ బాబాయిల పెళ్ళిళ్ళూ, అత్తయ్యలకి పెట్టుపోతలూ అన్నీ చూసే నాకు చిరాకులు ఉండవా? డబ్బు సమస్య ఒక్కటే కాదుగా... చాకిరీ ఉంటుందిగా, అది ఎవరైనా అర్థంచేసుకునేవారా? భర్తమీద కోపం చూపించకూడదు, పిల్లలు పసివారు, అత్తమామలు తల్లిదండ్రులతో సమానం. మా ఫ్రస్ట్రేషన్ ఎలా తీర్చుకోవాలో తెలియక ఏడుస్తాం నిస్సహాయంగా. ఓర్చుకోలేక ఎప్పుడైనా అమ్మా వాళ్ళకి చెప్తే 'సర్దుకోవాలి. సహనం ఆడవారికి దేముడిచ్చిన వరం. అన్నీ చేయగల నేర్పు ఆడవారికి పుట్టుకతో వస్తుంది' అనేవారు. అలా మమ్మల్ని మానసికంగా ప్రిపేర్ చేసేవారు. 'సూపర్ ఉమెన్' ముసుగులో ఎంత స్ట్రెస్‌నైనా పంటి బిగువున ఓర్చుకునేవాళ్ళం. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. అందరికీ ఒకరూ లేక ఇద్దరు పిల్లలు. అది ఆడైనా మగైనా సమానంగా పెంచుతున్నారు. అన్నింటిలో ఆడపిల్లల్ని కూడా ప్రోత్సహిస్తున్నారు. అలా, చిన్ననాటి నుంచీ సమానత్వానికి అలవాటుపడిన ఆడపిల్లలు పెళ్ళి అయ్యాక మాత్రం- 'భర్త ఎక్కువ' ఏమిటో ఎందుకో అర్థంకాక తికమక పడుతున్నారు. అక్క కూడా అలానే సఫర్ అయింది అప్పట్లో. అన్నింటిలో నెగ్గుతూ ఎన్నో దాటుతూ ఇంత దూరం వచ్చిన ఆడపిల్లల్ని ఈ పెళ్ళి అనే దాంట్లో 'భర్త' అనే పరీక్ష పెట్టి, మళ్ళీ పాత రోజుల వైపు తీసుకెళ్తున్నాం. నీ విషయమే తీసుకుందాం. నీకు వంట వచ్చు కదా, పెళ్ళయ్యాక సరదాకి కాదు కదా- మేఘన జ్వరంతో ఉన్నప్పుడు కూడా వంట చేయలేదట ఎందుకు?" సూటిగా అడిగింది కావేరి.

"నా వంట అలవాటైతే తను చేయడం మానేస్తుందనీ..." నసిగాడు వంశీ.

"ఎందుకు అనుకున్నావు అలా?" అడిగింది.

"రమేష్ అన్న చెప్పాడు" ఠక్కుమని చెప్పాడు వంశీ.

"నీకంటూ ఆలోచన లేదా, వాళ్ళూ వీళ్లూ చెప్పగానే వినేస్తావా? రమేష్ అన్ననే విడాకులు తీసుకుని ఒంటరిగా ఉన్నాడు, నీకేం సలహాలు ఇస్తాడు. అన్ని బంధాల్లోకీ పవిత్రమైనది వివాహబంధం. అది ఇప్పటి రోజుల్లో నిలబెట్టుకోవడం కష్టతరమవుతోంది. మేఘన- వాళ్ళ అమ్మానాన్నలకు ఒక్కతే కూతురు. అల్లారుముద్దుగా పెంచుకున్నారు. నీతో సమానమైన చదువు, జీతం, ఆస్తిపాస్తులున్నా... పిల్లని నీకిచ్చి ఎందుకు పెళ్ళి చేశారు? ఇంత ముద్ద అన్నం



పెడతావనా, తలదాచుకోవడానికి ఇల్లు ఇస్తావనా లేక వాళ్ళ పిల్ల వాళ్ళకు భారమైందా? వారి తరవాత వారిలా చూసుకుంటావని. జీవితాంతం తోడుగా ఉంటావని. పిల్లాపాపలతో ఇద్దరూ సుఖంగా ఉంటారని. మనం కూడా అక్కకి పెళ్ళి చేసేటప్పుడు ఇలానే అనుకున్నాం కదా. మరి ఇప్పుడు ఎలా మారావు? మాటకి ముందో వెటకారం వెనకో వేళాకోళం. ఎక్కడ నేర్చుకున్నావ్ ఇది. పెళ్ళి చేసుకునేది తోడు కోసం. మీకంటూ ఒక జీవితం ఉండటం కోసం. మేఘన నీతో కలిసి బతకాలని వచ్చింది, నీ కింద బతకాలని కాదు. కాలానికి అనుగుణంగా మన మనస్తత్వం మారాలి. ఒక్కసారి ఊహించుకో- అధికారాలూ అహంకారాలకు బదులు బాధ్యతలూ ప్రేమలూ ఉంటే ఆ కాపురం ఎంత అందంగా ఉంటుందో. వేరు వేరు కుటుంబాలూ అలవాట్లూ ఆచారాల నుంచి వచ్చిన ఇద్దరు- ఒకే జీవితం, ఒకే కుటుంబంగా మారడమే వివాహ వ్యవస్థ. దీన్ని నిలుపుకునే బాధ్యత నీమీదే ఎక్కువ శాతం ఉంది. అసలు ఇద్దరూ కలిసి టీ తాగడం, డిన్నర్ ప్రిపేర్ చేసుకోవడం, కబుర్లు చెప్పుకుంటూ తినటం చేయండి. మార్పు నీకే తెలుస్తుంది. తను 'నా మనిషి' అనే అభిమానంతో చూడు, అన్నీ అవే సర్దుకుంటాయి. ఆ ఇంటి యువరాణి, నీ ఇంటి మహారాణి. మీతరం మగపిల్లలైనా ఆ పాత ఆలోచనలు వదలండి. మీ విలువల్ని కాపాడుకుంటూ మీ భార్యకు తగ్గ గౌరవాన్ని ఇవ్వండి. చివరగా ఒక్కమాట- వాళ్ళ అమ్మా నాన్నల్ని హేళన చేయడం, అమర్యాదగా మాట్లాడడం చాలా తప్పు. అంత సంస్కారహీనంగా ప్రవర్తించకు. మనల్ని నమ్మి వాళ్ళ ప్రాణాన్ని మన ఇంటికి పంపారు. మనమూ అంతే ప్రాణంగా చూసుకోవాలి. నేను చెప్పినవి ప్రయత్నించి చూడు. అప్పటికీ మీరు కలిసి ఉండలేమనుకుంటే, 'విడాకులు' అనే ఆప్షన్ మీకు ఎప్పుడూ అందుబాటులోనే ఉంటుంది" ఇందిర తన సుదీర్ఘ ఉపన్యాసం ముగించి ఆకాష్‌ని చూసింది. తన మాటలు ప్రభావం చూపిస్తున్నాయి అని గ్రహించిన ఇందిర కిందికి వెళ్ళేందుకు లేచింది. వాళ్ళు రావడం చూసిన రామారావు గబగబా కిందకు వెళ్ళిపోయాడు.

★ ★ ★

రెండేళ్ళ తరువాత- ఆకాష్, మేఘనలకి పండంటి బాబు పుట్టాడు. ఆ రోజే నామకరణం జరిగింది. మూడో నెల కావడంతో బాబుతో సహా అత్తవారింటికి పంపుతున్నారు. అన్నీ సర్దుతున్నారు మేఘన, ఆమె తల్లి. మనవడ్ని ఎత్తుకుని మురిసిపోతున్న ఇందిర చేయి పట్టుకుని, బాబుని ఆడపడుచుకు ఇచ్చి, గదిలోకి తీసుకొచ్చింది మేఘన. "థ్యాంక్స్ అత్తయ్యా. ఇలాంటి రోజు ఒకటి వస్తుంది అని అనుకోలేదు. మీ వల్లే ఇదంతా" అంది.

పక్కనే ఉన్న మేఘన తల్లి "నిజం వదిన గారూ, అంపకాలప్పటికన్నా ఈ రోజు ధైర్యంగా సంతోషంగా పంపిస్తున్నాం మా అమ్మాయిని" అంది.

"నా ఫ్రెండ్స్ అందరూ 'ఆకాష్ లాంటి భర్త రావడం నీ అదృష్టం' అంటారు. నేను వాళ్ళకి చెబుతుంటా, 'మా అత్తయ్య లాంటి అత్తగారు రావడం మరీ అదృష్టం' అని."

చెమర్చిన కళ్ళతో ఒకరినొకరు హత్తుకున్నారు అత్తాకోడళ్ళు. ఆనందంతో మనసు నిండిపోయిన ఇందిర దూరంగా వియ్యంకుడితో కబుర్లు చెప్తూ సామాన్లు సర్దుతున్న రామారావుని చూసింది. ఆ రోజు తరవాత రామారావులో వచ్చిన మార్పు చూసి, వాళ్ళ సంభాషణ విన్నాడని అర్థంచేసుకుంది. ఇన్నేళ్ళకి తన వైవాహిక జీవితంలో కూడా పెద్ద మార్పులు రావడం, ముఖ్యంగా భర్త తనకీ తన వాళ్ళకీ, తన ఇష్టాయిష్టాలకూ గౌరవం ఇవ్వడం చూసి మనసులోనే సంబరపడింది.

"మీ ఆధ్వర్యంలో మీలానే పెంచుతా అత్తయ్యా" అంటున్న మేఘనని చూసీ, ఆకాష్ మేఘనల ముచ్చటైన కాపురాన్ని చూసీ మురిసిపోయింది. ★

ఏజెంట్ హాస్పిటల్... ఈ ఆసుపత్రిలో 14 మంది డాక్టర్లు, నలుగురు నర్సులు కలిసి రోజుకి పదివేల మంది రోగులని పరీక్షిస్తారు. 'అబ్బో, చాలా స్పీడు...' అనుకునేవారికి ఒక్కమాట. అక్కడున్న డాక్టర్లు కానీ, నర్సులు కానీ ఎవరూ మనుషులు కారు. వాళ్లంతా ఏఐ ఏజెంట్‌లు. 'బాబోయ్, ఇదేదో సైన్స్ ఫిక్షన్ సినిమాలా ఉందే, నమ్మలేకపోతున్నాం' అంటారా? కానీ నిజం... ఈ హాస్పిటల్ ఎక్కడుందో, ఎందుకోసం ప్రారంభించారో చూద్దాం.





డాక్టర్‌లేని ఆసుపత్రులివి!



నగరాల్లో హాస్పిటల్‌కి వెళ్లాలంటే ఆఫీసుకి ఒక రోజు సెలవు పెట్టాలి. అక్కడున్న క్యూలో మన నంబర్ రెండో, మూడో అయితే పర్వాలేదు. రెండంకెలకి చేరుకుంటే ఇక అంతే.... కళ్లు కాయలు కాచేలా ఎదురుచూడాలి. బీపీ చెకప్‌లూ, ఈసీజీల దగ్గర కూడా విసుగొచ్చేంత ఎదురుచూపులు తప్పవు. అంతా పూర్తయ్యాక డాక్టర్ మనకిచ్చే ఆ కొద్దిపాటి సమయంలో అనారోగ్యం గురించి కొంత చెప్పగలుగుతాం... కొన్ని మాటలు మనసులోనే మిగిలిపోతాయి. ఇక, మన మెడికల్ ఫైల్‌లో- ఏ పేపర్ పోగొట్టుకున్నా కష్టమే. ఆ మందుల్లో ఏది ఎప్పుడు వాడాలో తెలియక మరిన్ని సందేహాలు. ఒక్కోసారి మందులూ, వైద్యం కన్నా ప్రయాణ ఛార్జీలే ఎక్కువగా బాధిస్తుంటాయి. ఇదంతా నగరాల్లో ఉండేవారి సంగతి. ఇక, పల్లెల్లో ఉండేవారి గురించి చెప్పనక్కర్లేదు. ఎందుకంటే మంచి డాక్టర్లూ ఉండరు, సదుపాయాలూ ఉండవు. దాంతో చిన్నచిన్న అనారోగ్యాలకు కూడా- పనులన్నీ పక్కనపెట్టి, ఒక డాక్టర్ సరిగా నిర్ధరించకపోతే మరొకరి దగ్గరికి- అలా ఆసుపత్రుల చుట్టూ తిరగాలి. ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేందుకు చైనాలోని చింగ్‌హువా యూనివర్శిటీ చేసిన ప్రయోగమే ఈ 'ఏజెంట్ హాస్పిటల్'. ఇక్కడ డాక్టర్లు, నర్సులు, సిబ్బంది అంతా ఏఐ ఏజెంట్లే. రోగులు ఏఐ డాక్టర్లతో మాట్లాడొచ్చు. మాట్లాడకపోయినా పర్వాలేదు... 360 డిగ్రీల కోణంలో పనిచేసే ఏఐ సెన్సార్లు జలుబు మొదలుకుని ఆటోఇమ్యూన్ డిసీజ్‌లూ, క్యాన్సర్ల వరకూ- ఎలాంటి అనారోగ్యం ఉన్నా మూడు సెకన్లలోనే పసిగట్టేస్తాయి. ఆ వెంటనే ఈ- ప్రిస్క్రిప్షన్‌ని అందిస్తాయి. కన్సల్టేషన్, డయగ్నోసిస్, ప్రిస్క్రిప్షన్, ట్రీట్‌మెంట్ వంటివన్నీ చకచకా జరిగిపోతాయట. మనుషులు ఏళ్లపాటు చదివి అర్థం చేసుకున్నదాన్ని ఇవి ఎలా తెలుసుకుంటాయా అనుకుంటున్నారేమో... ఇక్కడున్న ఏఐ డాక్టర్లంతా యూఎస్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జామ్‌ని 94 శాతం మార్కులతో పాసైనవాళ్లే. అలాగని ఈ ఏఐ డాక్టర్లు సంప్రదాయ డాక్టర్లకి ప్రత్యామ్నాయమా అంటే కానే కాదంటున్నారు శాస్త్రవేత్తలు. ఎందుకంటే ఇదొక పైలెట్ ప్రాజెక్ట్. అయితే ఈ విధానంలో కొద్దిగా మార్పులు చేసి పట్టణ, పల్లె ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్యులు లేకుండా వైద్య పరీక్షలు చేసే 'డాక్టర్‌లెస్ క్లినిక్స్'ని తీసుకొచ్చారు అక్కడి శాస్త్రవేత్తలు. చూడ్డానికి చిన్నగా ఏటీఎమ్ మెషీన్లలా, కియోస్క్‌ల మాదిరిగా ఉండే 'డాక్టర్‌లెస్ క్లినిక్స్'ని కేరింగ్‌పాడ్స్ అనీ, డాక్టర్ ఆఫీస్‌లనీ కూడా అంటారు. వీటిలోని ఏఐ, స్మార్ట్ వైద్య పరికరాలు రోగులు క్యూల్లో ఎక్కువసేపు ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా క్షణాల్లో వ్యాధిని డయగ్నోసిస్ చేసి, అవసరం అనుకుంటే ఆ వెంటనే టెలిమెడిసిన్ పద్ధతిలో డాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిస్తాయి. ఈ పద్ధతిలో వ్యాధులని కచ్చితంగా నిర్ధరిస్తూ, నిపుణుల కొరతని అధిగమిస్తున్నారక్కడ. ఈ స్ఫూర్తితోనే దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌లోనూ క్షణాల్లో వైద్యపరీక్షలు చేసే ఏఐ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు.

మన దగ్గరా ఏఐ ఆసుపత్రులు...

దిల్లీ, బెంగళూరు, కోల్‌కతాల్లోనూ ఈ డాక్టర్‌లెస్ క్లినిక్స్ అందుబాటులోకి వస్తున్నాయి. కాకపోతే పూర్తిగా ఏఐపైనే ఆధారపడకుండా హైబ్రిడ్ విధానాన్ని అమలుచేస్తున్నారు. అంటే ఏఐ విధానంలో వేగంగా వ్యాధి నిర్ధరణ చేసి, అవసరాన్ని బట్టి సంబంధిత డాక్టర్లని వర్చువల్‌గా ఫోన్‌లో మాట్లాడేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పుణె కేంద్రంగా పనిచేస్తున్న 'క్లినిక్స్ ఆన్ క్లౌడ్' మెడికల్ కియోస్క్‌లు ఈ తరహావే. చూడ్డానికి ఏటీఎమ్ మెషీన్లలా ఉండే వీటి ముందు నిలుచుంటే గుండె, బీపీ, కన్ను, చెవికి సంబంధించిన 65 రకాల అనారోగ్యాలని పదినిమిషాల్లో చెప్పేస్తాయి. ఆ తర్వాత అవసరం మేరకు ఫోన్‌లో వైద్యులతో మాట్లాడే ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ మెషీన్లు ఇంతవరకూ 80 లక్షల మందిని స్క్రీన్ చేశాయట. దిల్లీలోని ఆకాస్‌ఎండీ, నురా సంస్థలూ ఇదే పద్ధతిలో ఏఐ పవర్డ్ క్లినిక్స్‌ని ప్రారంభించాయి. అలాగే టీసీఎస్, టాటా ట్రస్ట్ కలిసి ఏర్పాటు చేసిన 'డిజిటల్ నెర్వ్ సెంటర్' ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పంలో అంగన్వాడీ వర్కర్లూ, ఏఎన్‌ఎమ్‌ల సాయంతో ఏఐ వైద్యపరికరాలని వాడి పల్లె ప్రజల వ్యాధులని వేగంగా నిర్ధరిస్తూ, టెలిమెడిసిన్ పద్ధతిలో రోగులకి తక్షణ వైద్యం సాయం అందిస్తోంది. ఇదంతా చూస్తుంటే ఏఐనా... మజాకా అనిపిస్తోంది కదూ! ★



ముగ్గురు మిత్రుల ముత్యాల సాగు!





ఉద్యోగ వేటా, లేక వ్యాపారమా... ఇలా రోజులతరబడి చర్చించుకున్న ముగ్గురు మిత్రులకు పనికిరాకుండా పోయిన ఓ క్వారీ మంచి పరిష్కారాన్ని చూపించింది. కట్‌చేస్తే, ఇప్పుడా ముగ్గురూ ముత్యాలసాగుతో ఉపాధి పొందుతూ, చుట్టుపక్కల యువతలోనూ స్ఫూర్తిని పెంచుతున్నారు. వాళ్లే... కర్ణాటక, గడగ్ జిల్లాలోని హాటల గేరి గ్రామానికి చెందిన ప్రిన్స్‌వీర్, కృష్ణ జలమ్మనవర్, వీరేశ్. ముగ్గురిదీ ఎంబీఏ నేపథ్యం. వీర్ సినిమాల్లో చిన్నచిన్న వేషాలు వేస్తే, మిగిలిన ఇద్దరూ బెంగళూరులో ఉద్యోగాలు చేసేవారు. అయితే కొవిడ్‌తో ఉద్యోగాలు పోయి, ఉపాధిలేక సొంతూరికి తిరిగొచ్చారు. ముగ్గురూ కలిసి ఊళ్లోని పాడుబడ్డ క్వారీ దగ్గర కూర్చుని భవిష్యత్తు ప్రణాళికలు వేసుకునేవారు. ఏడాది గడిచేసరికి ఆ క్వారీలోనే ముత్యాలసాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంట్లోవాళ్లూ మిగిలిన స్నేహితులూ వద్దని వారించినా వినిపించుకోకుండా క్వారీని లీజుకు తీసుకుని పశ్చిబంగలోని ఓ ముత్యాలతయారీ కంపెనీతో మాట్లాడి వాళ్ల సూచనలతో ఆల్చిప్పల్ని తెచ్చి ముత్యాల సాగు మొదలుపెట్టారు. ఆరు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి రెండేళ్లు కష్టపడితే పదిహేను లక్షల రూపాయల ఆదాయం వచ్చింది. రెండో పంటతో లాభాలు రెట్టింపు అయ్యాయి. దాంతో స్థానికంగా ఉండే మరో పాతికమంది యువతా వీళ్లతో చేతులు కలపడంతో అదే ఉపాధిమార్గం అయ్యింది. వ్యాపారమూ పెరిగింది.

ప్రయోగం చేశారు... లాభాలు అందుకున్నారు!

ఉన్నత చదువులు చదువుకున్నా, ఉద్యోగాలు చేస్తున్నా... అనుకోని పరిస్థితులు వీళ్ల ఆలోచనా విధానాన్ని మార్చాయి. ఇంకేముంది... వినూత్న ప్రయోగాలు చేశారు. మరికొందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

వాననీటిని భద్రపరుస్తున్నారు







పొద్దున్నే ఆఫీసుకు బయలుదేరుతుంటే జోరున వాన పడిందనుకోండి... మనమైతే ఎలా వెళ్లాలా అని ఆలోచిస్తాం కదూ. కానీ, ఈ ముగ్గురు మిత్రులు మాత్రం... గంటకు పైగా ఎడతెరపిలేకుండా పడుతున్న వాన సంగతి అటుంచితే, రోడ్లమీద వరదగా పారుతూ వృథా అవుతున్న వర్షపునీటిని భద్రపరిస్తే బాగుండని ఆలోచించారు. అలా- ఎంబీఏ చదివి, ఉద్యోగాలు చేస్తున్న ఈ ముగ్గురూ కలిసి 'రెటాస్ ఎన్విరో సొల్యూషన్స్' పేరుతో ఏకంగా ఓ సంస్థనే ప్రారంభించారు. వాళ్లే అంకిత్ మగన్, ప్రియాంక్ జైన్, నీరజ్ చౌహాన్‌లు. వాననీటిని నిల్వ చేయడమే కాకుండా, శుద్ధిచేసేలా నీళ్ల ట్యాంకులూ, వరదనీటి నియంత్రణకోసం ప్రత్యేక పరిష్కారాలనూ తీసుకొచ్చారు. ఇంకేముంది దిల్లీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలతోపాటు టాటాస్టీల్, హెచ్‌పీసీఎల్.. వంటి సంస్థలూ వీళ్ల సేవల్ని ఉపయోగించుకున్నాయి. ప్రస్తుతం నోయిడా, బెంగళూర్, హైదరాబాద్‌లలో సేవలు అందిస్తూ... వర్షపునీరు వృథా కాకుండా చూస్తున్నారు.

నూనెలు తయారుచేస్తూ!







శిబి మణివణ్ణన్... తిరుచ్చికి చెందిన ఈ రోబోటిక్స్ ఇంజినీర్... ఒకప్పుడు రెస్టరంట్లతో కలిసి పనిచేస్తూ లీటర్ల కొద్దీ వంట నూనెల్ని కొనేవాడు. ఆ నూనెలు కల్తీకావడం గమనించిన శిబి... తానే సొంతంగా వంటనూనెల్ని గానుగల్లో తయారుచేస్తే ఎలా ఉంటుందని ఆలోచించాడు. దానికి కారణం లేకపోలేదు. శిబి తాత ఒకప్పుడు గానుగ నూనె అమ్మేవారట. ఇంట్లోనూ అదే వాడేవారట. అలా తయారుచేసిన నూనెకీ, ప్యాకెట్ల రూపంలో కొన్న రిఫైన్డ్ ఆయిల్‌కీ మధ్య రుచిలో తేడా ఉండటం చూశాక, గానుగ నూనెతో ఆరోగ్యానికి కలిగే మేలు అర్థమయ్యాక- ఉద్యోగాన్ని మానేసి కాలేజీ స్నేహితులైన మొహమ్మద్ యాసిన్, నవీన్‌రాజమారన్‌తో కలిసి గ్రామియా పేరుతో సంస్థను ప్రారంభించాడు. ముగ్గురూ కలిసి పల్లీ, నువ్వులు, కొబ్బరినూనెల్ని నెలకు యాభైవేల లీటర్ల చొప్పున తయారుచేస్తూ మరికొందరికీ ఉపాధి చూపించడం మొదలుపెట్టారు. అంతేకాదు, ఆ నూనెల్ని కాగితపు అట్టపెట్టెల్లోనూ గాజుసీసాల్లోనూ ప్యాక్‌చేస్తూ ముప్ఫైవేలకు పైగా కస్టమర్లను పొందగలిగారు. ఇప్పుడు ఏడాదికి దాదాపు పదికోట్ల రూపాయల టర్నోవర్‌ను అందుకుంటూ అమెరికా, కెనడాలకూ తమ వ్యాపారాన్ని విస్తరించారు.



వంటకాలకు రుచిని పెంచుతూనే సువాసననూ తెస్తుంది. మానసిక సాంత్వన కలిగిస్తూనే ఎన్నో పోషకాలనూ అందిస్తుంది. ఔషధ మొక్క అయినా గృహాలంకరణలో భాగమై, నట్టింట్లో పరిమళాలు వెదజల్లుతోంది. ఈ మధ్య ఎక్కువగా వినిపిస్తున్న రోజ్‌మేరీ గురించే ఈ వివరణ అంతా. కొంతకాలంగా అందరినోటా వినిపిస్తున్న ఈ మొక్క గురించి ఇంకాస్త తెలుసుకుందామా...

రోజ్‌మేరీ ఔషధాల సిరి!



చిన్న ముళ్లను పోలిన ఆకులూ, ఊదా రంగు పూలతో ఆకట్టుకుంటుంది రోజ్‌మేరీ. పుదీనా కుటుంబానికి చెందిన ఈ మొక్క అటు శారీరక ఆరోగ్యానికే కాకుండా ఇటు మానసిక సాంత్వనకూ, కేశ సంరక్షణకూ మేలు చేయడం వల్లే ఈ మధ్య అందరి నోటా వినిపిస్తోంది. అయిదువేల సంవత్సరాల క్రితం పోర్చుగల్‌లో పుట్టిన ఈ సుగంధాల మొక్క నెమ్మదిగా అమెరికాకు చేరింది. కొన్నేళ్లక్రితం తమిళనాడులోని తలవాడి హిల్స్, నీలగిరులు, ఉత్తరాఖండ్, బెంగళూరు తదితర రాష్ట్రాలకు చెందిన రైతులు దీన్ని వాణిజ్య పంటగా వేయడంతో రోజ్‌మేరీ ఆకులూ, పువ్వులే కాకుండా దీనికి సంబంధించిన ఉత్పత్తులూ క్రమంగా అందుబాటులోకి వచ్చాయి. ఇండోర్ మొక్కగానూ మారి, నట్టింటికి అందాన్నీ, సువాసననూ తెస్తోంది.

అయితే ఒకప్పుడు రోజ్‌మేరీని శుభ సందర్భాల్లోనే కాదు, రోజువారీ అవసరాలకోసమూ ఉపయోగించేవారట. ఎలాగంటే... ఈ ఆకుల్ని కాల్చితే... గాలి శుద్ధి అవుతుందని గ్రీకు ప్రజలు నమ్మేవారట. దీనితో తయారుచేసిన లేపనం గాయాల్ని త్వరగా మాన్పడమే కాక, కీళ్లనొప్పుల్నీ నివారిస్తుందని భావించి ఔషధాల తయారీలోనూ ఉపయోగించేవారు. యూరప్‌లో రోజ్‌మేరీని ప్రేమకు చిహ్నంగానూ భావిస్తారు. అందుకే... ఒకప్పుడు పెళ్లిళ్ల సమయంలో నవదంపతులు ఈ ఆకుల్ని అలంకరించుకునేవారట. ఇక, దీని గాఢమైన సువాసన కారణంగా రోజ్‌మేరీ కొన్ని వందల సంవత్సరాల క్రితం నుంచీ పరిమళాల తయారీలోనూ భాగమైంది. అన్నింటికీ మించి, మెడిటరేనియన్ వంటకాల్లో- ప్రధానంగా బ్రెడ్, సూప్, మంసాహారం, గ్రిల్డ్ వెజిటబుల్స్ తదితర పదార్థాల రుచిని పెంచేందుకూ, కమ్మని సువాసనను తెచ్చేందుకూ కాసిని రోజ్‌మేరీ ఆకుల్ని వేయడం ఎప్పటినుంచో ఉన్నదే.

పోషకాలూ ఎక్కువే...

ఔషధ మొక్కలైన లావెండర్, అలోవెరా, పుదీనా, థైమ్ మాదిరి... రోజ్‌మేరీ నుంచీ పోషకాలు అందుతాయి. ప్రధానంగా మ్యాంగనీస్, సి, బి6 వంటి విటమిన్లు, మెగ్నీషియం, ఇనుము, కాల్షియం వంటివెన్నో పోషకాలు రోజ్‌మేరీ సొంతం. అదేవిధంగా దీనిద్వారా అందే కార్నోసిక్ - రాస్మరినిక్ యాసిడ్లు ఒత్తిడిని తగ్గించి దీర్ఘకాలిక అనారోగ్యాలు దరిచేరకుండా కాపాడతాయి. ఇక, వీటిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంలో అంతర్గత వాపుల్నీ, నొప్పుల్నీ నివారించడంలో ముందుంటాయి. అంతేనా.. జీర్ణసంబంధ సమస్యల్ని తగ్గించి, రోగనిరోధకశక్తిని పెంచి, ఇన్‌ఫెక్షన్లను దరిచేరనివ్వదు రోజ్‌మేరీ. అన్నింటికీ మించి మూడ్ ఎన్‌హాన్సర్‌గానూ పిలిచే రోజ్‌మేరీతో మానసిక సాంత్వన కలుగుతుందనీ, ఏకాగ్రత పెరుగుతుందనీ చెబుతారు.

అలా ఎన్నో రకాలుగా మేలు చేయడం వల్ల తయారీదారులు రోజ్‌మేరీతో ప్రయోగాలు చేసి, రకరకాల ఉత్పత్తుల్ని తీసుకొచ్చేస్తున్నారు ఇప్పుడు... ఉదాహరణకు రోజ్‌మేరీ టీ. ఎండబెట్టిన ఆ ఆకుల్ని వేడినీటిలో వేస్తే చాలు... కమ్మని రోజ్‌మేరీ టీ తయారవుతుంది. అదే విధంగా రోజ్‌మేరీ ఆకులు సెబమ్‌ను ఉత్పత్తి చేసి, జుట్టు పొడిబారకుండా, చిట్లకుండా, రాలకుండా కాపాడుతూనే కుదుళ్లను దృఢంగా మారుస్తాయని అంటారు నిపుణులు. అందుకే, దీంతో నీళ్లు, షాంపూ, నూనె, హెయిర్‌స్ప్రే వంటివీ తయారుచేస్తున్నారు. ఇక, దీంతో తయారుచేసిన క్యాండిల్స్, జెల్... తదితర ఎన్నో ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. అన్నింటికీ మించి దీన్ని పెంచడమూ సులువే. ఒక కొమ్మను నాటితే చాలు, మొక్క వచ్చేస్తుంది. పైగా, నీళ్లు పెద్దగా అవసరం కూడా లేకపోవడం, ఎలాంటి వాతావరణంలోనైనా పెరగడం దీని ప్రత్యేకత గనుకే... ఇప్పుడు ఇండోర్ ప్లాంట్స్‌లోనూ భాగమైంది. అదండీ.. రోజ్‌మేరీ కథ. కాబట్టి ఇదేం మొక్క అనుకోకుండా... కలబంద మాదిరి ఇంట్లో పెంచుతూనే అవసరాన్ని బట్టి వాడేయండి. ★





సిసింద్రీ

గప్‌చుప్


పిల్లలంతా కాలక్షేపం చేస్తున్నారు కదూ! బొమ్మను బాగా గమనించి, కిందున్న ప్రశ్నలకు జవాబులు చెప్పండి చూద్దాం.

1. బొమ్మలో పదునైన వస్తువులు ఎన్ని ఉన్నాయి?
2. పిల్లలందరికీ ఓ పోలిక ఉంది. ఏంటది?
3. కుండీ పక్కన బుట్టలో ఉన్న పండ్లలో విత్తనం లేనిది ఏది?
4. ఇందులో ఒక పొరపాటు ఉంది. అదేంటబ్బా?
5. ఆంగ్ల అక్షరం 'L'తో ప్రారంభమయ్యే వస్తువులు రెండు ఉన్నాయి. ఏంటవి?



పోలికలేంటి?

ఈ బొమ్మల్లో అడ్డం, నిలువు, ఐమూలగా ఉన్నవాటికి కొన్ని పోలికలున్నాయి. అవేంటో చెప్పగలరా?




ఎవరు ముందు?

స్కూల్‌లో ఉదయం ప్రార్థన సమయంలో అయిదుగురు స్నేహితులు ఒకరి వెనక ఒకరు వరుసలో నిల్చున్నారు. ఎలాగంటే..
జానకి, కవిత మధ్యలో ఒకరున్నారు.
మోనిక, ఇషిత మధ్యలోనూ ఒకరున్నారు.
రోషిణి మాత్రం చివరిలో లేదు. అయితే, ఆ వరుసలో ముందు ఎవరు నిల్చున్నారో చెప్పగలరా?

దారి కనుక్కోండి



హోంవర్క్ చేసుకునేందుకు స్నేహితుడి ఇంటికి బయలుదేరాడు రాము. వెళ్లి చాలారోజులు కావడంతో దారి మర్చిపోయాడు. తనకు మీరు సాయం చేయరూ!



లెక్కించగలరా?

సెలవు రోజు కావడంతో సరదాగా పిక్నిక్‌కి వెళ్లాడు హరి. నీళ్లలోని గీతలను బాగా గమనించి, అక్కడ మొత్తం ఎన్ని చేపలు దాగి ఉన్నాయో లెక్కించ గలరా?




చక్కిలాల రసీదు!

పల్లవ రాజ్యానికి రాజు యుగంధరుడు. మంత్రికి విశ్రాంతి అవసరం కావడంతో ఆ స్థానంలో ఓ యువకుడిని నియమించుకోవాలని అనుకున్నాడు రాజు. రకరకాల పరీక్షల అనంతరం అజయుడు, విజయుడు మాత్రమే తుది పోటీలో నిలిచారు. వారిలోంచి ఒకరిని ఎంపిక చేసే బాధ్యతను మంత్రికే అప్పగించాడు రాజు. ఇద్దరికీ ఓ పరీక్ష పెట్టనున్నట్లు తెలిపి, మరుసటి రోజు రమ్మని వారిని పంపించివేశాడు మంత్రి. మర్నాడు ఉదయం ఆ యువకులు రాగానే... అప్పటికే సిద్ధం చేయించిన రెండు బుట్టల్లో చెరొకటి తీసుకొమ్మన్నాడు. అజయుడిని ఒక గ్రామానికీ, విజయుడిని మరో గ్రామానికీ వెళ్లి.. బుట్టలు అందినట్లు రసీదు రాయించుకొని రావాలని వారి చిరునామాలను చేతిలో పెట్టాడు మంత్రి. సరేనంటూ ఇద్దరూ చెరో దిక్కుకు బయలుదేరారు. మంత్రి చెప్పిన దారిలో మధ్యాహ్నం వరకూ నడిచాడు అజయుడు. ఎండేమో మండిపోతోంది.. ఆకలితో కడుపు నకనకలాడసాగింది. ఒకవేళ బుట్టలో భోజనం ఉందేమోనని దాని మూత తీసి చూశాడు. అందులో కొన్ని చక్కిలాలు కనిపించాయి. అక్కడే ఓ చీటీ, దానిపైన 'ఇందులో 300 చక్కిలాలు ఉన్నాయి. అవి అందినట్లు తెలపగలరు' అని రాసి ఉంది. ఎక్కువ ఏమైనా ఉన్నాయేమోనని లెక్కిస్తే, సరిగ్గా మూడొందలే ఉన్నాయి. ఆకలికి ఆగలేక అందులో పదిహేను తినేసి, మళ్లీ ప్రయాణం మొదలుపెట్టాడు అజయుడు. మంత్రి చెప్పిన వారింటికి వెళ్లి, 285 చక్కిలాలు అందినట్లు రసీదు తీసుకొని తిరిగి వచ్చేశాడు. విజయుడు కూడా మధ్యాహ్నం వరకూ నడిచాడు. తన భోజనం గురించి మంత్రి ఏమీ చెప్పకపోవడం కూడా పరీక్షలో భాగమేననుకున్నాడు. అజయుడిలాగే భోజనం ఏమైనా ఉందేమోనని బుట్ట మూత తీసి చూశాడు. అందులోనూ 300 చక్కిలాలు పంపుతున్నామనీ, అందినట్లు రసీదు పంపమనీ చీటీ ఉంది. లెక్కపెడితే అవి సరిగ్గా మూడొందలే ఉన్నాయి. విజయుడు తెలివైనవాడు కావడంతో ఒక్కో చక్కిలాన్ని తీస్తూ.. దాని వెలుపలి చుట్టును మాత్రమే జాగ్రత్తగా తుంచుతూ తిన్నాడు. సాయంకాలానికి బుట్ట ఇచ్చేసి, మూడొందలు అందినట్లు రసీదు రాయించుకొని తిరిగి వచ్చేశాడు. ఆకలి తీర్చుకున్నా, మూడొందల చక్కిలాలకు రసీదు తీసుకొచ్చి లౌక్యం ప్రదర్శించిన విజయుడినే తదుపరి మంత్రిగా ప్రకటించాడు రాజు.



దాగుడుమూతలు


ఫెన్సింగ్‌కి పెయింట్ వేస్తున్న ఈ బొమ్మలో.. కిందున్న వస్తువులు దాగి ఉన్నాయి. ఎక్కడున్నాయో వెతికి పట్టుకోండి చూద్దాం.



పదమేంటి?


నాలుగు అక్షరాల ఆంగ్ల పదాన్ని నేను.
నన్ను వెనకనుంచి చదివినా,
అద్దంలో చూస్తూ చదివినా అదే అర్థాన్నిస్తా.
ఇంతకీ నేనెవరినో తెలిసిందా?

ఆటాడుకుందాం...



ఇక్కడ కొన్ని పండ్లూ, అక్కడక్కడా ఖాళీ గడులూ ఉన్నాయి. అడ్డంగా, నిలువుగా ఎటుచూసినా ఒక పండు బొమ్మ ఒకసారే వచ్చేలా ఆ ఖాళీలను నింపగలరా?

రంగులేద్దాం



జవాబులు

గప్‌చుప్: 1. మూడు (ఒక కత్తెర, రెండు కత్తులు) 2. అందరూ స్మైలీ బొమ్మ ఉన్న టీషర్టు వేసుకున్నారు 3. అరటి 4. పొద్దుతిరుగుడు పువ్వు సూర్యుడి వైపు తిరిగి లేదు 5. Lamp, Laptop.

దాగుడుమూతలు: చెట్టు కాండంపైన కొవ్వొత్తి, టోపీలో గంట, ఫెన్సింగ్ చెక్కగా పెన్సిల్, ఇటుకల్లో పుస్తకం, రంగు డబ్బాల్లో కప్పు, పెయింట్ బ్రష్‌గా టిష్యూ పేపర్ రోల్, ట్రాలీ పక్కన పనిముట్టులో దువ్వెన, ఇంటి వెనకనున్న పొదలో కప్ప


పోలికలేంటి?: **అడ్డం:** గ్లవ్, వాటర్ బాటిల్, అబాకస్; **నిలువు:** గ్లాసు, కుల్ఫీ, డైస్; **ఐమూలగా:** అద్దం, బైనాక్యులర్.

లెక్కించగలరా?: 14

పదమేంటి?: NOON

ఎవరు ముందు?: రెండు నుంచి అయిదు స్థానాల్లో ఎవరున్నా.. ముందు మాత్రం రోషిణినే ఉంటుంది.

ఆటాడుకుందాం...



ఆరోగ్యానికి మంచిదని తెలిసినా... గోధుమరవ్వతో ఎప్పుడూ ఉప్మానే చేయలేంగా. కాబట్టి కాస్త మార్పుగా ఇడ్లీ, అట్టు, పొంగలి... వంటివి వండేస్తే సరి. పెద్దవాళ్లేంటి, పిల్లలూ అడిగి మరీ తింటారు. ట్రై చేయండి మరి.

గోధుమరవ్వతో వెరైటీగా!

పొంగలి

కావలసినవి: లావుగా ఉండే **గోధుమరవ్వ:** కప్పు, **పెసరపప్పు:** అరకప్పు, **ఉప్పు:** తగినంత, **నెయ్యి:** రెండు టేబుల్‌స్పూన్లు, **ఆవాలు:** చెంచా, **జీలకర్ర:** చెంచా, **ఎండుమిర్చి:** రెండు, **బరకగా దంచిన మిరియాల పొడి:** ఒకటిన్నర చెంచా, **ఇంగువ:** చిటికెడు, **పసుపు:** అరచెంచా, **కరివేపాకు రెబ్బలు:** రెండు, **అల్లం తరుగు:** చెంచా, **పచ్చిమిర్చి:** రెండు, **జీడిపప్పు పలుకులు:** రెండు టేబుల్‌స్పూన్లు.

తయారీ విధానం: కుక్కర్‌లో నెయ్యిని వేడిచేసి ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, జీడిపప్పు పలుకుల్ని వేయించుకోవాలి. ఇప్పుడు మిరియాలపొడి, ఇంగువ, కరివేపాకు వేయాలి. అవి చిటపటలాడాక అల్లం తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, పసుపు, పెసరపప్పు, గోధుమరవ్వను వేసి వేయించాలి. రెండు నిమిషాలయ్యాక సరిపడా ఉప్పు, నాలుగు కప్పుల నీళ్లు పోసి మూత పెట్టి, మూడు కూతలు వచ్చాక స్టవ్‌ని కట్టేస్తే కమ్మని రవ్వ పొంగలి రెడీ.



ఇడ్లీ

కావలసినవి: లావుగా ఉండే గోధుమరవ్వ: అరకప్పు, బొంబాయి రవ్వ: అరకప్పు, పెరుగు: అరకప్పు, నీళ్లు: కప్పు, నూనె: చెంచా, ఆవాలు: అరచెంచా, జీలకర్ర: అరచెంచా, మినప్పప్పు: చెంచా, సెనగపప్పు: చెంచా, జీడిపప్పు పలుకులు: టేబుల్‌స్పూను, కరివేపాకు రెబ్బలు: రెండు, నెయ్యి: రెండు చెంచాలు, వంటసోడా: పావుచెంచా, ఉప్పు: తగినంత, ఉల్లిపాయ తరుగు: రెండు టేబుల్‌స్పూన్లు, క్యాప్సికం ముక్కలు: రెండు టేబుల్‌స్పూన్లు, క్యారెట్ తురుము: రెండు టేబుల్‌స్పూన్లు, అల్లం తరుగు: చెంచా, పచ్చిమిర్చి తరుగు: చెంచా, కొత్తిమీర తరుగు: టేబుల్‌స్పూను.



తయారీ విధానం: స్టవ్‌మీద కడాయిని పెట్టి నూనె వేయాలి. అది వేడెక్కాక ఆవాలు, జీలకర్ర, మినప్పప్పు, సెనగపప్పు, జీడిపప్పు పలుకుల్ని వేయించుకోవాలి. ఇప్పుడు గోధుమ-బొంబాయిరవ్వల్ని కూడా వేసి దోరగా వేయించుకుని స్టవ్‌ని కట్టేయాలి. ఇందులో తగినంత ఉప్పు, పెరుగు, నీళ్లు పోసి అన్నింటినీ ఒకసారి కలిపి మూత పెట్టాలి. రెండు గంటలయ్యాక వంటసోడాతోపాటు కూరగాయ ముక్కల తరుగు వేసి, మరో పావుకప్పు నీళ్లు పోసి కాస్త పలచగా చేసుకోవాలి. ఇడ్లీ రేకులకు నెయ్యి రాసుకుని ఈ పిండిని వేసుకుని ఆవిరిపైన పావుగంట ఉడికించుకుంటే కమ్మని ఇడ్లీలు సిద్ధం.



అట్టు

కావలసినవి: సన్న **గోధుమరవ్వ:** కప్పు, **కంది పప్పు:** పావుకప్పు, **సెనగపప్పు:** పావుకప్పు, **ఎండు మిర్చి:** మూడు, **కరివేపాకు రెబ్బలు:** రెండు, **ఉల్లి పాయలు:** రెండు, **క్యారెట్ తురుము:** రెండు టేబుల్‌స్పూన్లు, **క్యాబేజీ తరుగు:** పావుకప్పు, **క్యాప్సికం తరుగు:** టేబుల్‌స్పూను, **నూనె:** పావుకప్పు, **ఉప్పు:** తగినంత.

తయారీ విధానం: ఓ గిన్నెలో గోధుమరవ్వ, కందిపప్పు, సెనగపప్పు, ఎండుమిర్చి వేసుకుని సరిపడా నీళ్లు పోసి రెండుగంటలు నానబెట్టుకోవాలి. తర్వాత పిండిలా రుబ్బుకుని తీసుకోవాలి. ఇందులో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని బాగా కలిపి మూత పెట్టాలి. పది నిమిషాలయ్యాక స్టవ్‌మీద పెనం పెట్టి... కొద్దిగా నూనె రాసి ఈ పిండిని మందంగా అట్టులా వేసుకోవాలి. నూనె వేస్తూ రెండువైపులా ఎర్రగా కాల్చుకుని తీసుకోవాలి. దీనికి అల్లంచట్నీ మంచి కాంబినేషన్.



కేసరి

కావలసినవి: లావుగా ఉండే **గోధుమరవ్వ:** కప్పు, **నెయ్యి:** అరకప్పు, **చక్కెర లేదా బెల్లం తరుగు:** ఒకటింబావు కప్పు, **వేడినీళ్లు:** మూడుకప్పులు, **జీడిపప్పు పలుకులు:** పావు కప్పు, **కిస్‌మిస్:** పావుకప్పు, **యాలకులపొడి:** అరచెంచా.

తయారీ విధానం: స్టవ్‌మీద కడాయిని పెట్టి చెంచా నెయ్యి వేసి జీడిపప్పు, కిస్‌మిస్ పలుకుల్ని వేయించుకుని విడిగా తీసి పెట్టుకోవాలి. అదే కడాయిలో పావుకప్పు నెయ్యి వేసి గోధుమరవ్వను దోరగా వేయించుకోవాలి. రవ్వ రంగు మారుతున్నప్పుడు వేడినీళ్లు పోసి స్టవ్‌ని సిమ్‌లో పెట్టాలి. రవ్వ బాగా ఉడికాక చక్కెర లేదా బెల్లం తరుగు వేసి కలిపి మరో చెంచా నెయ్యి, యాలకులపొడి వేయాలి. మధ్యమధ్య కలుపుతూ ఉండి... కేసరి చిక్కగా అవుతున్నప్పుడు వేయించుకున్న కిస్‌మిస్, జీడిపప్పు పలుకులు, మిగిలిన నెయ్యి వేసి బాగా కలిపి దింపేయాలి.

రాశి ఫలం

(నవంబరు 2 - 8)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

మనోబలం అవసరం. విజయాలు సాధిస్తారు. పరిస్థితులకు తగినట్టు ప్రణాళికలు తయారు చేసుకోవాలి. చెడును అతిగా ఊహించుకోకండి. విమర్శల్ని మనసులోకి తీసుకోవద్దు. ప్రశాంత జీవనంతో ఒత్తిడిని అధిగమిస్తారు. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన పనుల్ని చక్కబెడతారు. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆశయాలు నెరవేరతాయి. కాలం అనుకూలంగా ఉంటుంది. చేపట్టిన ప్రతి పనీ విజయవంతం అవుతుంది. పురస్కారాలు స్వీకరిస్తారు. కష్టానికి తగిన ప్రతిఫలం అందుతుంది. పదోన్నతులు వరిస్తాయి. ఆర్థిక ఫలితాలు ఉత్తమంగా ఉంటాయి. అయితే, దుబారాకు దూరంగా ఉండాలి. వివాదాస్పద సంభాషణలు వద్దు. లక్ష్మీదేవిని పూజించండి.



మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

వ్యాపారయోగం శుభప్రదం. ముఖ్య నిర్ణయాలు కలిసొస్తాయి. ఆత్మీయుల సహకారం అందుతుంది. ధనలాభం సూచితం. అదృష్టవంతులు అవుతారు. కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. మీరు నమ్మిన ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది. ఉద్యోగంలో స్వల్ప ఇబ్బందులు ఉన్నా, అంతిమంగా మేలు జరుగుతుంది. లక్ష్మీ అష్టోత్తరాన్ని పఠించండి.



కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

ధనయోగం ఉంది. ఆర్థికంగా బలపడతారు. పొదుపు-మదుపు గురించి ఆలోచించాల్సిన సమయం. మొహమాటాలకు దూరంగా ఉండండి. పరిస్థితులకు తగినట్టు స్పందించండి. లక్ష్య సాధనలో విఘ్నాలు ఎదురవుతాయి. ఆత్మవిశ్వాసంతో వ్యతిరేక పరిస్థితుల్ని అధిగమిస్తారు. కష్టానికి తగిన ప్రతిఫలం అందుతుంది. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

మేలైన ఫలితాలు సాధిస్తారు. బుద్ధిబలంతో వ్యాపార విజయాలు వరిస్తాయి. శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. సమాజంలో గౌరవం పెరుగుతుంది. స్వల్ప ప్రయత్నంతోనే అనుకున్న పనులు పూర్తవుతాయి. శుక్రయోగం ఆర్థికంగా మెరుగైన స్థానానికి చేరుస్తుంది. ప్రయాణాల్లో జాగ్రత్త. మహాలక్ష్మిని పూజించండి.



కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

బలమైన ప్రయత్నంతో విజయాలు వరిస్తాయి. చిన్నచిన్న సవాళ్లు ఎదురైనా ఒత్తిడికి గురికాకండి. లోతుగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి. భూలాభం సూచితం. గృహ, వాహన యోగాలు ఉన్నాయి. ఇంట్లో శుభకార్యం జరుగుతుంది. ఇబ్బందులు సృష్టించేవారితో జాగ్రత్త. అపార్థాలకు తావివ్వకండి. శుభవార్త వింటారు. మహాలక్ష్మిని ఉపాసించండి.



తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపారం లాభదాయకం. ఉత్తమస్థితి గోచరిస్తోంది. సంపాదనను సద్వినియోగం చేసుకోవాలి. ఉన్నతాధికారులతో సమన్వయం అవసరం. వివాదాలకు అవకాశం ఇవ్వకండి. కుటుంబ సభ్యుల భాగస్వామ్యంలో ఉత్తమ నిర్ణయాలు తీసుకుంటారు. నలుగురితో సౌమ్యంగా సంభాషించండి. అసాధ్యాల్ని సుసాధ్యం చేస్తారు. సూర్యభగవానుడిని ధ్యానించండి.



వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

లక్ష్మీయోగం సూచితం. ఏకాదశంలో ఉన్న శుక్రగ్రహం శుభాలను అందిస్తుంది. వృత్తి-ఉద్యోగ-వ్యాపారాల్లో ఏకాగ్రత అవసరం. సమాజంలో గౌరవం పెరుగుతుంది. వ్యాపారంలో కొద్దిపాటి ఇబ్బందులు ఉన్నా, వాటిని ఆత్మబలంతో అధిగమిస్తారు. వివాదాలకు అతీతంగా వ్యవహరించండి. ప్రయాణాల్లో జాగ్రత్త. విష్ణు సహస్రనామాల్ని చదువుకోండి.




ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

లక్ష్యం చేరువలోనే ఉంది. చిత్తశుద్ధితో మీదైన కర్తవ్యాన్ని నిర్వర్తించండి. ఉద్యోగంలో కలిసొస్తుంది. పేరుప్రతిష్ఠలు సంపాదిస్తారు. పరిస్థితులకు తగినట్టు స్పందించడం ద్వారా వ్యాపార సమస్యలను అధిగమిస్తారు. ఆత్మీయులతో విభేదాలు వద్దు. శక్తికి మించిన రుణభారాన్ని నెత్తిన వేసుకోకండి. పని పట్ల మరింత శ్రద్ధ అవసరం. పరమేశ్వరుడిని ఆరాధించండి.



మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

విజయాలు గోచరిస్తున్నాయి. అదృష్టం సిద్ధిస్తుంది. ఉద్యోగంలో పదోన్నతులు లభిస్తాయి. కొత్త ప్రయత్నాలు సఫలం అవుతాయి. అధికార లాభం సూచితం. భాగ్య శుక్రయోగం మేలు చేస్తుంది. స్థిరాస్తులు వృద్ధి చెందుతాయి. భూ, గృహ, వాహనాది యోగాలు ఉన్నాయి. ప్రశంసలు అందుకుంటారు. కాలం కలిసొస్తుంది. మహాలక్ష్మిని ఉపాసించండి.



కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

మనోబలంతో కొత్త కార్యక్రమాలను ఆరంభించండి. ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయి. మొహమాటం వల్ల ఖర్చులు పెరిగే ఆస్కారం ఉంది. స్పష్టమైన ప్రణాళికతో వ్యాపారంలోని సవాళ్లను అధిగమిస్తారు. అనుభవజ్ఞుల సలహాలను గౌరవించండి. కుటుంబ భాగస్వామ్యంలోనే ముఖ్యమైన పనులను చేపట్టండి. నవగ్రహ ధ్యాన శ్లోకాలను పఠించండి.



మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

మనోబలంతో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. సానుకూల ఫలితాలు లభిస్తాయి. వృత్తి, ఉద్యోగాల్లో ఎదురయ్యే సవాళ్లను పట్టుదలతో అధిగమిస్తారు. ఉద్దేశపూర్వకంగా ఆటంకాలు సృష్టించేవారితో జాగ్రత్త. మీరు నమ్మిన ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది. వారం మధ్యలో ఓ పని విజయవంతంగా పూర్తవుతుంది. నవగ్రహ శ్లోకాలను పఠించండి.

పదకేళి

1		2	✱	3			4	✱	5		6
	✱	7	8		✱	✱	9	10		✱	
11	12	✱		✱	13	14	✱		✱	15	
✱	16		✱	17				✱	18		✱
19		✱	20	✱	21		✱	22	✱	23	24
	✱	25		26	✱	✱	27		28	✱	
	✱	29			✱	✱	30			✱	
31	32	✱		✱	33	34	✱		✱	35	
✱	36		✱	37				✱	38		✱
39		✱	40	✱	41		✱	42	✱	43	44
	✱	45		46	✱	✱	47		48	✱	
49			✱	50				✱	51		

ఆధారాలు- అడ్డం

1. మహిళ (3)
3. అనుక్షణం, నిరంతరం (4)
5. పార్వతి (3)
7. భూమి, ధరణి (3)
9. తామరపువ్వులో అమ్మాయిపేరు (3)
11. దేవ నర్తకి (2)
13. ఏరు, వంక (2)
15. ఆకాంక్ష, కోరిక (2)
16. కిరణం, వెలుగు (2)
17. నాన్నకి అమ్మ (4)
18. ప్రీతి, మక్కువ (2)
19. హస్తం (2)
21. తుదిలేని సంపంగి (2)
23. సత్యం (2)
25. వాదులాట, సంవాదం (3)
27. బంగారం (3)
29. దుమ్ము, విసురు గాలితో ఎగసే ధూళి (3)
30. 'పెళ్ళి ....' అంటే- వివాహానికి ఆహ్వానం (3)
31. నరం; వీణ తీగ (2)
33. 'ఇవి' కాదు- అక్కడున్నవి (2)
35. క్షీరం (2)
36. ఖాళీ, సున్నా (2)
37. శంక (4)
38. స్త్రీ (2)
39. పండు (2)
41. ప్రజలు, జనత (2)
43. స్వప్నం (2)
45. మార్గంలో (3)
47. బొమ్మరిల్లులో హీరోయిన్ పాత్ర పేరు... నవ్వుతూ ఉండే అమ్మాయని అర్థం (3)
49. ఒక వాయిద్యం (3)
50. చివరి రాత్రి (4)
51. అభయం, రక్షణ (3)

ఆధారాలు- నిలువు

1. పెదవి (3)
2. మారణం, సంహారం (2)
3. సప్తర్షులలో ఒకరు... అనసూయ భర్త (2)
4. సందేహం (2)
5. రాయి (2)
6. అడియాస, నైరాశ్యం (3)
8. శూన్యం (2)
10. ఇల, వసుధ (2)
12. ఒక నక్షత్రం (3)
13. కాకి (3)
14. నేలను తవ్వడానికి రైతు ఉపయోగించేది (3)
15. వసంతం (3)
19. తెల్లని రేకులతో ఎర్రని కాడలతో పరిమళించే చిన్న పుష్పం (4)
20. మామకాని మామ (4)
22. అగ్నిదేవుడు (4)
24. మృగాలు, పశువులు (4)
25. నింద, దూషణం; తగవు (2)
26. నాడి, రక్తనాళం (2)
27. కోతి (2)
28. దుర్వాసన (2)
32. పరమశివుడి ఆయుధం (3)
33. చెల్లెలు (3)
34. ఆకాశంలో రవాణా సాధనం (3)
35. ఇరవైఐదు (3)
39. ప్రయోజనం, పరమార్థం (3)
40. మెడకు తాడు బిగిస్తే..? (2)
42. ద్వేషం, కక్ష (2)
44. ఉప్పు (3)
45. భార్య (2)
46. ఆ బావి చాలా '...' (2)
47. సౌఖ్యం, ఆనందం (2)
48. నిశీథి (2)

సుడొకు

		5			3		8	
	8					1		5
		4	9		5			3
	5		1			2		
		7	2	9	4	8		
		6			7		1	
5			3		9	6		
8		2					9	
	7		5			4		

గతవారం సమాధానాలు

పదకేళి

1 అ	న	2 సూ	య	■	3 హా	■	4 స	ర	5 సి	జం	■
ర	■	ర్య	■	6 శ	ని	7 వా	రం	■	గ్గ	■	8 వా
9 క	10 న	కాం	11 బ	రం	■	12 మ	గు	13 వ	■	14 బా	స
■	15 ల	తి	క	■	16 దా	నం	■	17 ని	18 ర	స	న
19 సి	త	■	రా	■	సు	■	20 గు	■	21 జ	ట	■
మం	■	22 సీ	■	23 అ	లు	24 గు	■	25 గ	తం	■	26 మం
27 తం	28 పు	ల	29 మా	రి	■	30 ర	31 జ	ని	■	32 ధ	డ
■	న్న	■	ద్రి	■	33 కం	క	న	■	34 క	మ	లం
35 అ	మి	36 తం	■	37 మం	త్రి	■	38 కు	39 వ	ల	యం	■
డు	■	40 తు	మ్మె	ద	■	41 కో	డు	కు	■	42 తి	43 సు
44 గు	45 రు	వు	■	46 మ	47 ద	నం	■	48 శం	49 తా	■	వ్యా
■	షి	■	50 రా	తి	రి	■	51 భ్రం	■	52 పం	తు	లు

సుడొకు

2	9	5	6	7	8	1	4	3
8	7	6	1	3	4	9	2	5
4	1	3	5	2	9	7	6	8
3	2	9	8	4	7	6	5	1
7	5	1	3	9	6	4	8	2
6	4	8	2	1	5	3	9	7
9	6	2	7	8	1	5	3	4
5	3	7	4	6	2	8	1	9
1	8	4	9	5	3	2	7	6


A B C D E F 1 2 3


ఇళ్లన్నీ భూమి లోపలే..!



ఏదైనా ఊరికి వెళితే ఎత్తయిన మేడలూ, మిద్దెలూ కనిపిస్తాయి. ఉత్తర చైనాలోని లియోస్ పీఠభూమి ప్రాంతంలో ఉన్న గ్రామాల్లో అడుగుపెడితే మాత్రం ఎంత పెద్ద ఇల్లు అయినా సరే, దాన్ని పూర్తిగా చూడలేం. ఎందుకంటే అక్కడ ఇళ్లన్నీ భూమిలోపల మట్టి దిబ్బల్ని తొలిచి, 'యౌడాంగ్' పేరుతో కట్టుకున్నారు మరి. కొన్ని వేల సంవత్సరాల క్రితం వాతావరణ మార్పుల్ని తట్టుకునేలా సరికొత్త ఆలోచనతో నిర్మించుకున్న ఊరు ఇది. చలికాలంలో వెచ్చగా, ఎండాకాలంలో చల్లగా ఉండటమే ఈ ఇళ్ల ప్రత్యేకత. మట్టి, కలపను వాడుతూ కట్టుకున్న ఈ ఇళ్లు- చూడ్డానికి మండువా లోగిళ్లలా ఉంటాయి. అక్కడి నుంచి లోపలికి వెళితే మెట్లూ, వంటగది, డైనింగ్ రూమ్, ఇతర గదులన్నీ కనిపిస్తాయి. విద్యుత్తూ, నీళ్ల సరఫరా లాంటి సౌకర్యాలూ ఉంటాయట. పాత సంప్రదాయ పద్ధతిలోని ఈ వింత ఊరు ప్రస్తుతం ఓ చక్కటి సందర్శక ప్రాంతం. ఎక్కడెక్కడి నుంచో పర్యటకులు వచ్చి, నేలలోపల దాగున్న ఈ ఇళ్లన్నీ చూస్తూ, సరదాగా తిరిగేస్తుంటారు!














ఆలయంలో కొలువుదీరిన శివలింగాన్ని చూడగానే 'హర హర మహాదేవ... శంభో శంకర' అంటూ దండం పెట్టుకుంటారు భక్తులు.
అలాంటిది అల్లంత దూరం నుంచే, ఆలయమే శివలింగం రూపంలో దర్శనమిస్తే- పరవశంతో పులకించిపోరూ!
అసోంలో కట్టిన మహా మృత్యుంజయ టెంపుల్ 126 అడుగుల ఎత్తులో భక్తుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తోంది. ప్రపంచంలోనే
అత్యంత ఎత్తయిన లింగాకృతిగా పేరుపొందిన ఈ దేవాలయం... కార్తిక మాసమంతా భక్తులతో కిటకిటలాడుతుంది!

